ఆదివారం
02-06-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 341
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఐస్‌లాండ్‌లో అధ్యక్ష ఎన్నికలు

హెల్‌సింకీ: ఐస్‌లాండ్‌లో అధ్యక్ష ఎన్నికలు శనివారం జరిగాయి. ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు పోలింగ్ సాగింది. ఫలితాలు ఆదివారం వెలువడతాయి. మొత్తం 12 మంది అధ్యక్ష రేసులో నిలిచారు. ఎన్నికలు ఒక దశలోనే ముగియడంతో ఫలితాలు వెంటనే వెలువడనున్నాయి. ఎక్కువ ఓట్లు సాధించిన వారిని అధ్యక్ష పీఠం వరించబోతోంది. ఐస్‌లాండ్ అధ్యక్షునికి రాజకీయపరంగా పరిమిత అధికారులు ఉంటాయి. చట్టాలను వీటో చేసే అధికారముంటుంది. కాగా, అధ్యక్ష పదవి కోసం మాజీ ప్రధాని కత్రిన్ జకోబ్స్‌దోత్రిర్, వ్యాపారవేత్త హల్లా తోమస్‌దోత్రిర్ మధ్య గట్టి పోటీ జరిగింది.

గందరగోళం

వైసీపీ వన్స్‌మోర్ అంటున్న కొన్ని సంస్థలు

ఎన్డీఏ కూటమిదే పీఠమంటూ మరికొన్ని సంస్థలు

ఎవరి పాట వారిదే

టీడీపీ కూటమి అనుకూల సంస్థలు

సంస్థ	టీడీపీ	వైసీపీ	జనసేన	బీజేపీ	ఇతరులు
పీపుల్స్ పల్స్	95-110	45-60	14- 20	2- 5	-
కేకే సర్వేస్	133	14	21	7	-
చాణక్య స్ట్రాటజీస్	114-125	39-49	-	-	0-1
పయనీర్	144	31	-	-	-
రైజ్‌జి	113-122	48-60	-	-	0-1
జనగళం	113-122	48-60	-	-	0-1
పల్స్‌టుడే	125	50	-	-	-

వైసీపీ అనుకూల సంస్థలు

సంస్థ	వైసీపీ	టీడీపీ కూటమి
ఆరా సంస్థ సర్వే	94-104	71-81
ఆత్మసాక్షి	98-116	59-77
రేస్ సంస్థ సర్వే	117-120	48-50
పోల్ స్ట్రాటజీ గ్రూప్	115-125	50-60
ఆపరేషన్ చాణక్య	95-102	64-68
చాణక్య పార్థదాస్	110-120	55-65
జన్‌మత్	95-103	67-75

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎగ్జిట్ పోల్స్ గందరగోళం సృష్టించాయి. వాటి కోసం పోలింగ్ ముగిసిన దగ్గర నుంచి తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూసిన రాజకీయపార్టీల నేతలకు, రాష్ట్ర ప్రజలకు నిరాశే ఎదురైంది. కొన్ని సంస్థలు వైసీపీ మరలా విజయ దుందుభి మోగిస్తుందని ప్రకటించగా... మరికొన్ని సంస్థలు ఎన్డీఏ కూటమిదే పీఠమంటూ ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించాయి. దీంతో రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రాబోతుందనే దానిపై స్పష్టత రాక గందరగోళం నెలకొంది. పార్టీల విజయావకాశాలపై ఉత్కంఠ మరో మూడు రోజులు కొనసాగే పరిస్థితులు ఏర్పడ్డాయి. వివిధ మీడియా హౌస్‌లు, సర్వే సంస్థలు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి, వాటిని క్రోడీకరించి రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రాబోతుందో అంచనా వేశాయి. మే 13న జరిగిన ఎన్నికల్లో ఏపీలో ఇంతకుముందెన్నడూ లేని విధంగా అత్యధికంగా 82.37శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 2,387 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 46 మంది పోటీలో ఉండగా, అనకాపల్లి జిల్లా చోడవరం అసెంబ్లీ నుంచి అత్యల్పంగా ఆరుగురు మాత్రమే పోటీలో నిలిచారు. మంగళగిరిలో నారా లోకేశ్ సహా 40 మంది బరిలో ఉన్నారు. కుప్పం నుంచి చంద్రబాబు సహా 13 మంది, పిఠాపురం అసెంబ్లీ బరిలో పవన్ సహా 13 మంది పోటీ

- మిగతా 2 లో

మూడోసారీ మోదీనేనా!

- పుంజుకున్న ఇండియా కూటమి
- దక్షిణాదిన బీజేపీకి అవకాశాలు
- తమిళనాడులో 'ఇండియా' హవా
- ఎగ్జిట్‌పోల్స్ అంచనా

న్యూఢిల్లీ: దేశంలో 18వ సార్వత్రిక ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య పటిష్ఠతకు ఎంతో కీలకమైనవి. కాషాయ పార్టీ బీజేపీ గత పదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థను ఛిద్రం చేయడమే కాకుండా, హిందూత్వ వాదాన్ని ప్రజల్లోకి బలవంతంగా చొప్పించేందుకే మొగ్గు చూపింది. వరుసగా రెండుసార్లు కేంద్రంలో మిత్రపక్షాలతో కలిసి ఎన్డీఏగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే కాషాయ పాలనకు అంతం పలికేందుకు ప్రజాస్వామ్య, లౌకిక శక్తులైన విపక్ష పార్టీలు ఇండియా కూటమిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని గద్దె దించేందుకు ఐక్యంగా ముందుకు సాగాయి. ఈ నేపథ్యంలో ఏడు విడతల సార్వత్రిక ఎన్నికలు శనివారంతో ముగిశాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మతం పేరుతో మంటలు రేపేలా ప్రసంగాలు చేశారు.

వివిధ సర్వే సంస్థలు వెల్లడించిన వివరాలు

	ఎన్డీఏ	ఇండియా కూటమి	ఇతరులు
దైనిక్ భాస్కర్	285- 350	145-201	33-49
ఇండియా న్యూస్-డి-డైనమిక్స్	371	125	47
జన్ కి బాత్	362-392	141-161	10-20
రిపబ్లిక్ భారత్-మాట్రిజ్	353-368	118-133	43-48
రిపబ్లిక్ టీవీ-పి మార్క్యూ	359	154	30
న్యూస్ నేషన్	342-378	153-169	21-23

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సైతం తుంగలో తొక్కారు. కేంద్ర ఎన్నికల సంఘం దీనిని చూసీచూడనట్లుగా వ్యవహరించింది. మోదీ తన ప్రచారంలో ముస్లింలపై తన అక్కసు వెళ్లగక్కారు. లౌకిక, ప్రజాస్వామ్య హననానికి పూనుకున్నారు. అధికార పీఠమే పరమావధిగా నియంత రీతిలో ప్రసంగాలు చేస్తూ ప్రచారం చేశారు. దీనిని ఇండియా కూటమి నాయకులు గట్టిగానే ఎదుర్కొన్నారు. అయితే జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు అనేక సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి. టెలివిజన్ ఛానెళ్లు ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించాయి. ఎగ్జిట్ పోల్ అంచనాలు ప్రాథమికంగా దేశం ఎలా ఓటు వేసింది అనే దాని గురించి ఒక ఆలోచనను అందిస్తాయి. ఎగ్జిట్ పోల్స్ సమాచారంపై అందరూ ఆసక్తి కనబరిచారు. ఈ ఎగ్జిట్ పోల్స్‌లో అనేక సర్వేలు ఎన్డీఏ భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి వస్తాయని అంచనా వేశాయి. దక్షిణాదిలో బీజేపీ లాభపడుతుందని పేర్కొన్నాయి. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తిరిగి వస్తుందని వెల్లడించాయి. 350 సీట్లకు పైగా గెలుపొందుతుందని, ప్రతిపక్ష ఇండియా కూటమి 125 నుంచి 200

- మిగతా 2 లో

నేడు అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఫలితాలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఈనెల 4వ తేదీన వెలువడనుండగా, దీనికి రెండ్రోజుల ముందుగానే జూన్ 2వ తేదీన అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌లోని 60 అసెంబ్లీ స్థానాలు, సిక్కింలోని 32 నియోజకవర్గాలకు ఏప్రిల్ 19న పోలింగ్ జరిగింది. కాగా, లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు సైతం జరిగిన ఆంధ్రప్రదేశ్, ఒడిశా ఫలితాలు జూన్ 4న వెలువడతాయి. అరుణాచల్ ప్రదేశ్‌లో బీజేపీ, కాంగ్రెస్ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. బీజేపీ మొత్తం 60 సీట్లలో పోటీ చేయగా, కాంగ్రెస్ 19 స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టింది. నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) మరో రెండు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. బీజేపీ

- మిగతా 2 లో

మోదీ కంటే 'హోదా' ముఖ్యం

- ఏపీకి బీజేపీ తీవ్ర అన్యాయం
- ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌ను కోల్పోతున్నాం
- రాష్ట్రం కోలుకోవాలంటే ప్రత్యేక హోదా అనివార్యం
- అది ఇండియా కూటమితోనే సాధ్యం
- రాష్ట్రం మేలు కోసం టీడీపీ, వైసీపీ నిర్ణయం తీసుకోవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిందని, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, అప్పులపాలైన ఏపీ కోలుకోవాలంటే ప్రత్యేక హోదా ఒక్కటే శరణ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి రావడం వల్లనే ప్రత్యేక హోదా అమలు సాధ్యమన్నారు. దేశవ్యాప్తంగా తీవ్ర ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్న ప్రధాని నరేంద్ర మోదీ మళ్లీ అధికారంలోకి రావడం అసంభవమని, ఇండియా కూటమికి అనుకూలంగా మంచి ఫలితాలు రాబోతున్నాయన్నారు. అందువల్ల చంద్రబాబు, జగన్ కుర్చీ కోసం ఆరాటం వదిలి... రాష్ట్రానికి మేలు జరిగే నిర్ణయాలు తీసుకోవాలని, ప్రత్యేక హోదా, విభజన అంశాలు అమలు చేసే ఇండియా కూటమికి అండగా నిలవాలని సూచించారు. విజయవాడ దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో

- మిగతా 2 లో

295 స్థానాల్లో గెలుస్తాం

- 'ఇండియా'తోనే ప్రజా ప్రభుత్వం
- ప్రజా పోల్స్‌లో వెల్లడి
- బీజేపీ ఆశలు గల్లంతు తప్పదు
- ఓట్ల లెక్కింపులో పారదర్శకత కోసం ఈసీకి వినతి: ఖర్గే
- కౌంటింగ్‌పై 'ఇండియా' పార్టీల సమీక్ష
- ఏజెంట్లకు మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: రాబోయేది ఇండియా కూటమి ప్రభుత్వమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. అధికారం చేపట్టేందుకు కావాల్సిన 295కుపైగా స్థానాల్లో తమ కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఇండియా కూటమికి అనుకూలంగా ప్రజలు తీర్పు చెబుతారన్నారు. ఇండియా కూటమి నాయకులు శనివారం ఖర్గే నివాసంలో రెండున్నర గంటల పాటు భేటీ అయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఎన్నికలు ముగిసిన క్రమంలో 4వ తేదీన ఓట్ల లెక్కింపు రోజున తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు జరిపారు. పార్టీ కార్యకర్తలకు, కౌంటింగ్ ఏజెంట్లకు మార్గదర్శకాలు విడుదల చేశారు. సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాత ఎగ్జిట్ పోల్స్‌పై టీవీల్లో నిర్వహించే చర్చలకు హాజరు కావాలని ఇండియా కూటమి నిర్ణయించింది.

సమావేశం అనంతరం ఖర్గే విలేకరులతో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు పారదర్శకంగా, నిష్పాక్షికంగా సాగేలా చూడాలని కోరేందుకు ఈసీ సమయాన్ని కోరినట్లు తెలిపారు. 295కుపైగా స్థానాల్లో గెలుస్తామని, ప్రజల తీర్పు అనుకూలంగా రాబోతోందని చెప్పారు. ఇండియా కూటమి

- మిగతా 2 లో

కేజ్రీవాల్ బెయిల్‌పై
తీర్పు రిజర్వు

అనారోగ్యం ఒట్టిదే: ఈడీ వాదన

న్యూఢిల్లీ: మద్యం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌పై తీర్పును ఈనెల 5వ తేదీకి రిజర్వు చేస్తూ ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ఉత్తర్వులు జారీచేశారు. ఆరోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలైందేగానీ...సుప్రీంకోర్టు మంజూరు చేసిన బెయిల్ కాలాన్ని పొడిగించాలని కాదని విచారణ కోర్టు పేర్కొంది. తీర్పును రిజర్వు చేసినట్లు తెలిపింది. ఆప్ కన్వీనర్ ఆదివారం లొంగిపోవాల్సి ఉన్నందున తీర్పును శనివారమే వెలువరించాలని కేజ్రీవాల్ తరఫు న్యాయవాది కోరారు. ఇందుకు న్యాయమూర్తి నిరాకరించారు. వాదనలు, న్యాయవాదులు సమర్పించిన పత్రాలు ఎక్కువగా ఉన్నందున ఇందుకు సమయం పడుతుందని చెప్పారు. ఈడీ

- మిగతా 2 లో

సల్మాన్‌ఖాన్ హత్యకు కుట్ర

బిష్ణోయ్ గ్యాంగ్ పనేనన్న పోలీసులు

ముంబై: బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌ను అంతమొందిస్తామని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రతిజ్ఞ చేసినట్లు, ఆ దిశగా భారీ ప్రణాళికలే వేసినట్లు తాజాగా బయటపడింది. సల్మాన్ కదలికలపై నిరంతరం నిఘా వేయడంతో పాటు ఆయన కారును చుట్టుముట్టి కాల్పులు జరపాలని

- మిగతా 2 లో

ముగిసిన పోలింగ్ ఘట్టం

- లోక్‌సభ ఏడవ దశలో చెదురుమదురు ఘటనలు
- సాయంత్రం 5 గంటలకు 58 శాతం ఓటింగ్
- చెరువులో ఈవీఎంలు పడేసిన దుండగులు

దేశంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఘట్టం ముగిసింది. చివరి, ఏడవ దశ పోలింగ్ శనివారం స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది.

2లో

సీఎం జగన్‌కు ఘనస్వాగతం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్ విదేశీ పర్యటన ముగిసింది. మే 17న లండన్‌కు కుటుంబ సమేతంగా వెళ్లిన ఆయన... తిరిగి శనివారం తాడేపల్లికి చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయం వద్ద జగన్‌కు ఘన స్వాగతం లభించింది. వివిధ ప్రాంతాలకు చెందిన నేతలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, రాయలసీమ జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల ముగిసిన తర్వాత లండన్‌కు వెళ్లారు. 15 రోజులపాటు లండన్‌లోని వివిధ ప్రాంతాలను కుటుంబ సభ్యులతో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

హలో.. సర్వే సంస్థా..? మీ సర్వేలో నేను గెలిచినట్టు చెప్పారు. దయచేసి నేను గెలిచినట్టు సర్టిఫికెట్ ఇవ్వండి! ప్రమాణస్వీకారం చేస్తా!

1.26 ట్రిలియన్ల డివిడెండ్‌తో పీఎస్‌యూల రికార్డు



న్యూదిల్లీ: గతేడాది కంటే ఈ ఏడాది సీపీఎస్‌యూ(సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్)లు 1.26 ట్రిలియన్ల డివిడెండ్‌తో రికార్డు సృష్టించాయి. ఈ ఏడాది సీపీఎస్‌యూల డివిడెండ్ 28.7 శాతం పెరిగింది. గతేడాది (2023) డివిడెండ్ 97,750 కోట్ల రూపాయలు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఆదాయాన్ని సమకూర్చడంలో సీపీఎస్‌యూలకు 60 శాతం వాటా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో చెల్లించే డివిడెండ్లు ఉన్నప్పటికీ... పీఎస్‌యూల వల్ల రూ.76,166 కోట్ల డివిడెండ్ వచ్చే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. గతేడాది రూ.59,406 కోట్లు కంటే ఈ ఏడాది 28.2 శాతం పెరగొచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా. గడచిన ఐదేళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే సీపీఎస్‌యూల వాటా పెరుగుతూనే ఉంది. వార్షిక వృద్ధిరేటు 19.2 శాతం. ప్రత్యేకించి ఈ కాలంలో వృద్ధిరేటు 18.9 శాతంగా ఉంది. వివిధ ప్రభుత్వ రంగ వాటాలను పరిశీలిస్తే... ఎన్‌టీపీసీ వాటా 51.1 శాతంతో చాలా తక్కువగా ఉంది. 98.25 శాతంతో పంజాబ్, సింధ్ బ్యాంకులు అత్యధిక వాటా కలిగి ఉన్నాయి. 2024లో జాబితాలో ఉన్న సీపీఎస్‌యూల వల్ల రెండింతలు ఆదాయం వస్తుంది. ఇది బడ్జెట్‌కు డబుల్ బొనాంజా అవుతుంది. దీంతో వీటి వాటా 2.11 ట్రిలియన్లు అవుతుందని ఆర్‌బీఐ తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ ఏడాది డివిడెండ్, లాభాలు ప్రభుత్వరంగం నుండి 1.54 ట్రిలియన్లు వసూలయ్యే అవకాశం ఉందని ఆర్‌బీఐ సహా అనేక సంస్థలు అంచనా వేశాయి. 2023లో ప్రభుత్వరంగ సంస్థల నుండి డివిడెండ్‌లు, వాటి నుండి వచ్చిన లాభాలు రూ.99,913 కోట్లుగా ఉంది. ఈ ఏడాది రూ.16,945.5 కోట్ల చెల్లింపుతో రిఫైనర్ ఇండియన్ ఆయిల్ కంపెనీ (ఐఓసీ) అతిపెద్ద డివిడెండ్ చెల్లింపుదారుగా ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది ఈ కంపెనీ చెల్లింపు దాదాపు 300 శాతం పెరిగింది. దీని తర్వాత కోల్ ఇండియా (రూ.15,715 కోట్లు), ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (రూ.15,411 కోట్లు), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (రూ.10,463 కోట్లు) డివిడెండ్ చెల్లింపుదారుగా నిలిచాయి. మొత్తం మీద వ్యాపారంలో జాబితా చేయబడిన 60 సీపీఎస్‌యూలలో 42 డివిడెండ్ల ప్రామాణిక నమూనాను బిజినెస్ స్టాండర్డ్ ప్రకటించింది. 2022లో 44, 2023లో 47, ఈ ఏడాది 42కి సీపీఎస్‌యూలు పడిపోయాయి. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, మంగళూర్ రిఫైనరీస్ అండ్ పెట్రో కెమికల్స్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, ఇంద్రప్రస్థ గ్యాస్, ఎస్‌బీఐ కార్డ్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్, ఐడీబీఐ బ్యాంక్ డివిడెండ్ల జాబితాలో ఉన్నాయి. వీటితోపాటు ప్రభుత్వ జోక్యం లేని ఇతర సీపీఎస్‌యూలు కూడా ఉన్నాయి. డివిడెండ్ల జాబితాలో ఉన్న 60 సీపీఎస్‌యూల లాభాలు 40.2 శాతం పెరిగి 4.69 ట్రిలియన్ల గరిష్ట స్థాయిని నమోదు చేశాయి. గతేడాది 3.35 ట్రిలియన్లు లాభాలు ఉన్నాయి. కాగా, సీపీఎస్‌యూలు 26.8 మేర పంపిణీ చేయనున్నాయి. అయితే ఈక్విటీ డివిడెండ్‌గా వాటి నికర లాభాల శాతం గతేడాది కంటే ఈ ఏడాది తగ్గింది. గతేడాది 29.2 శాతంగా ఉంది. గత మూడు సంవత్సరాల నుంచి పీఎస్‌యూల అమ్మకాల వేగం మందగించింది. కాగా నయా ఉదారవాద విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు కుంచించుకుపోయాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా... ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టడం సర్వసాధారణమైంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కోట్ల రూపాయల ఆదాయం ఆర్జించిపెడుతోన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వాలే నాశనం చేయడం చూస్తున్నాం.

అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే పోటీ లేకుండా 10 స్థానాల్లో గెలుపొందింది. ఈసారి (2024) అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 82.95 శాతం పోలింగ్ జరిగింది. 2019లో 82.17 శాతం పోలింగ్ జరిగింది. కాగా, సిక్కింలో ప్రధాన పోటీ అధికార సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కేఎం), సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్) మధ్య ఉంది. బీజేపీ, కాంగ్రెస్ మరో రెండు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి.

సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి (2024) 79.88 శాతం పోలింగ్ జరుగగా... 2019లో 81.43 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 41 సీట్లు గెలుచుకుని, పెమా ఖండూ తిరిగి సీఎం అయ్యారు. కాంగ్రెస్ 4 సీట్లు, జేడీయూ 7, ఎన్‌పీపీ 5 సీట్లు గెలుచుకున్నాయి. సిక్కింలో 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌కేఎం 17 సీట్లతో మెజారిటీ సాధించగా, ప్రేమ్ సింగ్ తమాంగ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఎస్‌డీఎఫ్ 15 సీట్లకు పరిమితమైంది.

సల్మాన్‌ఖాన్ హత్యకు కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

కుట్ర చేసినట్లు పోలీసుల పరిశోధనలో వెలుగుచూసింది. ఇందుకోసం ఆ గ్యాంగ్ పాకిస్థాన్ నుంచి ఏకే 47 సహా ఆయుధాలు కొనుగోలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పాక్‌కు చెందిన ఆయుధాల సరఫరాదారుడి నుంచి ఏకే 47, ఎం 16, ఏకే 92, హై కాలిబర్ ఆయుధాలను ఆ గ్యాంగ్ తెప్పించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇటీవల బాంద్రాలోని సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద కాల్పుల ఘటన తెలిసిందే. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు సంచలన విషయాలు తెలిసినట్లు సమాచారం. ఈ కాల్పుల ఘటన కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని బిష్ణోయ్ ముఠా నాయకుడు లారెన్స్ బిష్ణోయ్ హెచ్చరించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

కాల్పుల కేసును లోతుగా దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో ఇద్దరు అనుమానితులను ప్రశ్నించగా సల్మాన్‌ను హత్య చేయడానికి బిష్ణోయ్ గ్యాంగ్ భారీ ప్రణాళిక రచించినట్లు బయటపడింది. ముంబైలోని బాంద్రాలో ఉన్న సల్మాన్ నివాసంతో పాటు పన్వేల్‌లోని ఆయన ఫాంహౌస్ వద్ద బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులు నిఘా పెట్టారని పోలీసులు తెలిపారు. హీరో కదలికలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఏకంగా 25 మంది వరకు ఫాంహౌస్ సమీపంలో తిష్ట వేశారని చెప్పారు.

సీఎం జగన్‌కు ఘనస్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

కలిసి సందర్శించారు. ఈనెల నాల్గో తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడికానుండడంతో తిరిగి వచ్చారు.

విమానాశ్రయంలో సీఎంకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రులు మేరుగు నాగార్జున, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, చెల్లిబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేశ్, ఎంపీలు విజయసాయిరెడ్డి నందిగం సురేశ్, ఏపీ సామాజిక సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, వల్లభనేని వంశీ, కైలే అనిల్‌కుమార్, మల్లాది విష్ణు, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, పార్టీనాయకుల నల్లగట్ల స్వామిదాస్ పుష్పగుచ్ఛాలు అందజేశారు. దారిపొడవునా సీఎంకు వైసీపీ శ్రేణులు రోడ్డుకు ఇరువైపులా నిలబడి స్వాగతించారు. వైసీపీ జెండాలు చేతబట్టి జై జగన్ అంటూ నినదించారు.

గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. పులివెందుల నియోజకవర్గంలో జగన్ సహా 27 మంది పోటీలో నిలిచారు. మొత్తానికి భారీ పోలింగ్‌కు తగినట్లుగానే ఎగ్జిట్‌పోల్స్ వెలువడ్డాయి. సర్వత్రా ఆసక్తిగా ఎదురుచూసిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించి మళ్లీ అధికారంలోకి రానుందని కొన్ని సంస్థలు తేల్చాయి. నవరత్నాల పేరుతో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఎన్నికల మేనిఫెస్టోను 99శాతం అమలు చేయడం, వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పాలన ప్రజల ముంగిటకు తీసుకురావడం, విద్య, వైద్య రంగాల్లో నాడు-నేడు అమలు, వ్యవసాయరంగంలో ఆర్బీకే కేంద్రాలు వంటి విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన జగన్ ప్రభుత్వానికే మరోసారి జనం జై కొట్టనున్నారని ఆరా సంస్థ తేల్చింది. 94 నుంచి 104 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలవబోతుందని ఆరా మస్తాన్ తెలిపారు. అలాగే 13-15 లోక్‌సభ స్థానాల్లో వైసీపీ గెలవబోతుందని ఆరా అంచనా వేసింది. కడప కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వైఎస్ షర్మిలకు డిపాజిట్లు కూడా వచ్చే అవకాశం లేదని ఆరా మస్తాన్ తేల్చేశారు. పులివెందులలో జగన్, కుప్పంలో చంద్రబాబు, మంగళగిరిలో లోకేష్, పిఠాపురంలో పవన్ కల్యాణ్, తెనాలిలో నాదెండ్ల మనోహర్, ఉండిలో రఘురామకృష్ణరాజు, హిందూపురంలో బాలకృష్ణ, టెక్కలిలో అచ్చెన్నాయుడు విజయం సాధిస్తున్నట్లు వెల్లడించారు. ఇక మరికొన్ని సంస్థలు ఎన్డీఏ కూటమి భారీ సీట్లతో విజయం సాధించబోతున్నట్లు ప్రకటించాయి. ఇందుకు అనేక కారణాలను విశ్లేషించాయి. ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా మార్చారని, అభివృద్ధి జాడ లేదని యువత వ్యతిరేకంగా ఉన్నట్లు గుర్తించారు. ఇసుక కొరతతో నిర్మాణ రంగం కుదేలవడంతో దానికి అనుబంధ రంగాల్లో పనిచేసే కార్మికులు ప్రభుత్వం తీరుపై అసంతృప్తిగా ఉన్నారు. అలాగే మద్యం ధరలు పక్క రాష్ట్రాల కంటే అధికంగా ఉండటం, సరైన బ్రాండ్లు దొరకకపోవడంతో మందు బాబుల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. డీఏ, పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం, జీతాల చెల్లింపులో ఆలస్యం కావడం, పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో దక్కకపోవడం వంటి కారణాలతో ఉద్యోగులు దూరమయ్యారు. వైసీపీ కంటే ఎన్డీఏ ఎన్నికల మేనిఫెస్టో పట్ల ప్రజలు ఆకర్షితులయ్యారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 ఏళ్లకే రూ.4వేల పెన్షన్ చెల్లింపు, అవి కూడా ఏప్రిల్ నుంచే చెల్లిస్తానని హామీ ఇవ్వడం, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం, ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా పంపిణీ చేయడం వంటి అంశాలు ఆకర్షించినట్లు సంస్థలు పేర్కొన్నాయి. అన్నింటికంటే వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో భూములు లాక్కుంటుందని ఎన్డీఏ కూటమి నేతలు చేసిన విస్తృత ప్రచారంపై ఓటర్లలో ఆందోళన వ్యక్తమైందని, ఇటువంటి మరికొన్ని కారణాలతో ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత కూటమి విజయానికి కారణాలుగా ఆయా సంస్థలు పేర్కొన్నాయి.

ముగిసిన పోలింగ్ ఘట్టం

న్యూదిల్లీ/కోల్‌కతా : దేశంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఘట్టం ముగిసింది. చివరి, ఏడవ దశ పోలింగ్ శనివారం స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు 58.34 శాతం ఓటింగ్ నమోదయింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సందేశ్‌ఖాలీ ప్రాంతంలో టీఎంసీ, బీజేపీ మద్దతుదారుల మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. కొన్ని పోలింగ్ కేంద్రాలను ఆక్రమించుకుని రిగ్గింగ్‌కు పాల్పడటం, ఈవీఎంలలో అవాంతరాలు ఏర్పడినట్లుగా ఫిర్యాదులు వచ్చాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వరుసగా మూడో సారి పోటీ చేస్తున్న ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసితో సహా ఏడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్‌లోని 57 నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. తీవ్రమైన వేడి వాతావరణం మధ్య చండీగఢ్‌తో పాటు పంజాబ్‌లోని మొత్తం 13, హిమాచల్ ప్రదేశ్‌లోని నాలుగు, ఉత్తర ప్రదేశ్‌లోని 13, పశ్చిమ బెంగాల్‌లోని 9, బీహార్‌లో 8, ఒడిశాలో 6, జార్ఖండ్‌లోని మూడు స్థానాలకు ఓటింగ్ జరిగింది. అలాగే ఒడిశాలోని మిగిలిన 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు, హిమాచల్ ప్రదేశ్‌లోని ఆరు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల పోలింగ్ జరిగింది. శనివారం నాటి ఓటింగ్‌తో ఏప్రిల్ 19న ప్రారంభమైన మారథాన్ పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఆంధ్ర ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరిగాయి.

ఆరువారాలు కొనసాగిన ఎన్నికలు

దేశంలో ఆరు వారాల పాటు లోక్‌సభ ఎన్నికలు కొనసాగాయి. 1951-52 తర్వాత రెండవ అతి పొడవైన సాధారణ ఎన్నికలు ఇవి కావడం విశేషం. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ వరుసగా మూడోసారి అధికారం చేపట్టాలని కోరుకుంటుండగా, కొన్ని రాష్ట్రాల్లో ఉమ్మడి పోరాటం చేయడం ద్వారా ఎన్‌డీఏను కలవరపెట్టాలని ప్రతిపక్ష ఇండియా కూటమి ప్రయత్నించింది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈసీ ఓటింగ్ యాప్ ప్రకారం సాయంత్రం 5 గంటల వరకు అంచనా వేసిన పోలింగ్ శాతం 58.34గా ఉంది. జార్ఖండ్‌లో దాదాపు 67.95 శాతం ఓటింగ్ నమోదయింది. ఉత్తర ప్రదేశ్‌లో 54 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 69.89 శాతం, బీహార్‌లో 48.86 శాతం, హిమాచల్ ప్రదేశ్‌లో 66.56 శాతం పోలింగ్ నమోదయింది. పంజాబ్‌లో సాయంత్రం 5 గంటల వరకు 55.20 శాతం, చండీగఢ్‌లో 62.80 శాతం, ఒడిశాలో దాదాపు 62.46 శాతం ఓటింగ్ నమోదయింది. సార్వత్రిక ఎన్నికల తొలి ఆరు దశల్లో వరుసగా 66.14 శాతం, 66.71 శాతం, 65.68 శాతం, 69.16 శాతం, 62.2 శాతం, 63.36 శాతం పోలింగ్ నమోదయింది. తుది విడత ఎన్నికల బరిలో ఉన్న 904 మందిలో ఇతర ప్రముఖ అభ్యర్థులు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ, ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ కుమార్తె మిసా భారతి, నటి కంగనా రనౌత్ ఉన్నారు. ఇదిలాఉండగా, బీజేపీ ఈసారి 370 సీట్లను లక్ష్యంగా పెట్టుకుంది. దాని మిత్రపక్షాల సహాయంతో 400 మార్కును దాటుతామని చెబుతోంది. పార్లమెంటు దిగువ సభలో 543 స్థానాలు ఉండగా, మెజారిటీ మార్కు 272. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

బెంగాల్‌లో ఘర్షణలు

బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో ఎన్నికల అవకతవకల ఆరోపణలపై టీఎంసీ, బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. టీఎంసీ గూండాలు ఓటర్లను ఓట్లు వేయకుండా అడ్డుకున్నారని బీజేపీ అభ్యర్థి రేఖా పాత్ర ఆరోపించారు. టీఎంసీ ఎదురు దాడి చేస్తూ, పాత్ర, బీజేపీ గూండాలు ఎన్నికల వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారని ఆరోపించింది. బసంతి ఎక్స్‌ప్రెస్ హైవేపై రెండు వర్గాలు ఘర్షణకు దిగడంతో గుంపును చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించారు. బసిర్‌హాట్ ఎస్పీ హుస్సేన్ మెహెదీ రహమాన్ మాట్లాడుతూ సందేశ్‌ఖాలీలోని బయ్‌మరీ వద్ద టీఎంసీ, బీజేపీ మద్దతుదారుల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారని, దీనికి సంబంధించి ఒకరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. జాదవ్‌పూర్, డైమండ్ హార్బర్ నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో కూడా టీఎంసీ, బీజేపీ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. జాదవ్‌పూర్‌లో టీఎంసీ, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్), బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. పార్టీలు తమ పోలింగ్ ఏజెంట్లను బూత్‌లలోకి రాకుండా ఆపారని ఆరోపించారు. జాదవ్‌పూర్ నియోజకవర్గం పరిధిలోని భాంగర్‌లో టీఎంసీ, ఐఎఫ్ఎఫ్ మద్దతుదారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రెండు వైపుల నుంచి నాటు బాంబులు విసురుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. రెండు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకోవడంతో నిరసనలు చెలరేగాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భద్రతా సిబ్బంది లాఠీచార్జి చేసి అనేక నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు.

మోదీ కంటే 'హోదా' ముఖ్యం

(మొదటిపేజీ తరువాయి)

రామకృష్ణతోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జల్లి విల్సన్, జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి జూన్ 2వ తేదీతో పదేళ్లు ముగుస్తుండగా... విభజన అంశాల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం విచారకరమన్నారు. పైగా ఇప్పటివరకు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌పైనా ఆదివారంతో హక్కు కోల్పోతున్నామన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఆస్తుల పంపకాలు ఏ ఒక్కటీ పూర్తి కాలేదు. కడప ఉక్కు పరిశ్రమ, రామాయపట్నం పోర్టు ఊసే లేదు. వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని మొండిచేయి చూపారు. విశాఖ రైల్వే జోన్ మంజూరు చేశామని చెబుతూనే... రాష్ట్ర ప్రభుత్వమే భూమి ఇవ్వలేదని కేంద్రం బొంకుతోంది. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరాన్ని పదేళ్లుగా పూర్తి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాలపై నెపం నెడుతూ నీరుగార్చారు. గతంలో చంద్రబాబుకి పోలవరం ఏటీఎంలా మారిందని విమర్శించిన ప్రధాని మోదీ... ఇప్పుడు ఆయనను పక్కనబెట్టుకుని జగన్‌కు రూ.15వేల కోట్లు ఇచ్చినా పూర్తి చేయలేకపోయాడని విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి చేయలేనప్పుడు నిర్మాణ పనులను మీరే చేపట్టి ఎందుకు పూర్తి చేయలేకపోయారని రామకృష్ణ ప్రశ్నించారు. ప్రధాని హోదాలో ఇంత బాధ్యతారాహితంగా మాట్లాడటం మోదీకే చెల్లిందని ఆయన విమర్శించారు. ఇక పార్లమెంటు సాక్షిగా నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని ముగిసిన అధ్యాయమంటూ మోదీ మొండిచేయి చూపారు. ఇలా అన్ని విధాలుగా ఏపీకి పదేళ్లుగా తీవ్ర అన్యాయం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై వైసీపీ, టీడీపీ నోరు విప్పి మాట్లాడాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. గతంలో విభజన అంశాల అమలు కోసం ఎన్డీఏ ప్రభుత్వం నుంచి బైటకు వచ్చి పోరాడిన చంద్రబాబు... తనకు ఎక్కువ ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి తెస్తానని ప్రగల్భాలు పలికిన జగన్ ఆలోచనా విధానం ఇప్పటికైనా మారాలన్నారు. అధికారంలోకి ఎవరు వచ్చినా మీ కుర్చీ కోసం ఆరాటపడటం ఆపి... రాష్ట్రానికి మేలు జరిగే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఎన్డీఏ కూటమికి 400 సీట్లు ఖాయమని మోదీ ఆడిన మైండ్‌గేమ్ పటాపంచలవబోతోందని, ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, బకాయిల గురించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి గవర్నర్‌ను కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రమంత్రిగా పనిచేసిన ఆమెకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వివరాలు ఎలా తెలుసుకోవాలో... కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేసే అవకాశం లేదనే విషయం ఆమెకు తెలియదా అని ప్రశ్నించారు. ఎవరిని మభ్యపెట్టడానికి ఈ నాటకాలంటూ ఆయన విమర్శించారు. వివేకానంద స్మారక స్థలంలో నరేంద్రమోదీ ధ్యానంపై ప్రశ్నించగా... ఆయన చేసేది మెడిటేషన్ కాదు, మీడియా అటెన్షన్ అంటూ ఎద్దేవా చేశారు. సర్వమతాలు సమానమని మానవాళికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి వివేకానందుడని, మత విద్వేషాలు రేపడం, ప్రజల మధ్య కుల, మత, ప్రాంతీయ చిచ్చు రేపుతూ రాజకీయ లబ్ది పొందాలని యత్నించడం మోదీ నైజమని రామకృష్ణ విమర్శించారు. మోదీ ఎన్ని డ్రామాలాడినా మళ్లీ ప్రధాని కాలేరని పేర్కొన్నారు. జి.ఓబులేసు మాట్లాడుతూ ఇప్పటివరకు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌పై హక్కు కోల్పోవడం వల్ల ఉపాధి, వైద్య సౌకర్యాల విషయంలో తీవ్రనష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ ప్రోద్బలంతో ప్రధాని మోదీ ఇప్పటివరకు సెలవుదినంగా పాటిస్తున్న ఆదివారం స్థానంలో సోమవారం చేర్చాలని యత్నించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

295 స్థానాల్లో గెలుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అధ్వర్యంలో కేంద్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని ధీమా వ్యక్తంచేశారు. 'ఇండియా కూటమి 295కుపైగా స్థానాల్లో గెలుస్తుంది. నాయకులందరితో మాట్లాడిన తర్వాతే ఈ అంచనాకు వచ్చాం. ఇది ప్రజాసర్వే. ఈ మేరకు సమాచారం ప్రజల నుంచి నాయకులకు చేరింది. ప్రభుత్వ సర్వేలు, ప్రభుత్వ మీడియా మిత్రులు సంఖ్య పెంచి మురిపిస్తున్నాయి. ప్రజలకు నిజమేమిటో చెప్పే ప్రయత్నాన్ని కూటమి నాయకులు చేస్తున్నారు. మన పోరు పూర్తి కాలేదు. అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలంతా అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. తమ వంతు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని ఖర్గే అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సానుకూల ఫలితాన్ని ఆశిస్తున్నామని, సర్వశక్తులు ఒడ్డి పోరాడామని, భారతీయులంతా అండగా నిలిచారని, ప్రజల పోల్ గెలుస్తుందని, బీజేపీ ఎగ్జిట్ పోల్స్ చిత్తవుతాయని ఖర్గే వ్యాఖ్యానించారు.

దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా ఇండియా కూటమి ముందుకు వెళుతోందన్నారు. 295కుపైగా స్థానాల్లో ఇండియా కూటమి గెలుస్తుందని చెప్పారు. బీజేపీకి 200 స్థానాలు వస్తాయని, అదే ఎన్డీయేగా లెక్కేస్తే 235 స్థానాలు వస్తాయన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమికి అనుకూలంగా వస్తాయి. బీజేపీ ఓడిపోతుంది. ఆయన (మోదీ) సముద్రాన్ని చూసేందుకు వెళ్లారు. ప్రజలకు వెన్నుచూపారు' అని అన్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ మార్పు కోసం ప్రజలు ఓటేశారని చెప్పారు. ఇండియా కూటమికి 295కుపైగా స్థానాలు లభిస్తాయన్న అంచనా ఉందన్నారు. అప్రమత్తంగా ఉండాలని తమ ఏజెంట్లను ఇండియా కూటమి పార్టీలు మార్గనిర్దేశం చేశాయని చెప్పారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేలా చూడాలని కోరేందుకు ఈసీ అపాయింట్‌మెంటు కోరినట్లు రాజా తెలిపారు. జార్ఖండ్ సీఎం చంపై సోరెన్ మాట్లాడుతూ 'ఇండియా కూటమి జార్ఖండ్‌లో రాణిస్తుందని, 10కిపైగా స్థానాల్లో గెలుస్తుందని, 295కుపైగా స్థానాలతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ 'ప్రజలు గెలవబోతున్నారు... ఇండియా గెలుస్తుంది. జూన్ 4 తర్వాతే ప్రధాని అభ్యర్థి ఎవరో నిర్ణయిస్తాం' అని అన్నారు. '400 పార్' అనే బీజేపీ చిత్రం మొదటి దశలోనే ఫ్లాప్ అయిందని విమర్శించారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ ఫలితాలు వచ్చాక ఉమ్మడి కనీస కార్యక్రమం రూపొందుతుందని, కొత్త ప్రభుత్వానికి అదే ఆధారమవుతుందని తెలిపారు. ఇండియా సమావేశంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, శరద్ పవార్, ఫరూక్ అబ్దుల్లా, దీపాంకర్ భట్టాచార్య, కల్పనా సోరెన్, రాఘవ్ చద్దా తదితరులు పాల్గొన్నారు. టీఎంసీ, పీడీపీ అధినేతలు మమతా బెనర్జీ, మెహబూబా ముఫ్తీ వేర్వేరు కారణాలతో గైర్హాజరయ్యారు.

ఎగ్జిట్ పోల్స్ చర్చల్లో పాల్గొంటాం: పవన్ ఖేరా

ఎగ్జిట్ పోల్స్‌పై జరిగే టీవీ చర్చల్లో ఇండియా కూటమి పాల్గొంటుందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా తెలిపారు. ఇండియా కూటమి భేటీ అనంతరం ఈ మేరకు నిర్ణయం జరిగిందని వెల్లడించారు. ఎగ్జిట్ పోల్స్ ఫిక్సింగ్ చేసే బీజేపీ నిజరూపాన్ని బట్టబయలు చేయాలని ఇండియా కూటమి సంకల్పించినట్లు తెలిపారు. తొలుత ఎగ్జిట్ పోల్స్‌పై చర్చల్లో పాల్గొనరాదని భావించగా, శనివారం భేటీ క్రమంలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత నిర్ణయాన్ని మార్చుకున్నట్లు పవన్ ఖేరా వెల్లడించారు.

కలెక్టర్లకు అమిత్‌షా బెదిరింపులు: జైరాం రమేశ్

కేంద్ర మంత్రి అమిత్ అన్ని జిల్లా మెజిస్ట్రేట్‌లు, కలెక్టర్లను బెదిరిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. 'కేంద్ర హోంమంత్రి... అందరు డీఎంలు/కలెక్టర్లకు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇప్పటికే 150 మందితో మాట్లాడారు. దీనిని బట్టి అధికారం కోసం బీజేపీ ఎంతలా ప్రాకులాడుతున్నదో అర్థం చేసుకోవచ్చు' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

కేజ్రీవాల్ బెయిల్‌పై తీర్పు రిజర్వు

(మొదటిపేజీ తరువాయి)

తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. కేజ్రీవాల్ శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి కేసును తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. తనంతట తానుగా లొంగిపోనున్నట్లు ఆయన తెలిపారన్నారు. 'మధ్యంతర బెయిల్ సమయంలో ప్రచారం నిర్వహించిన కేజ్రీవాల్‌కు ఆకస్మికంగా సుస్తీ చేసిందా? వాస్తవాలు తొక్కి పెట్టి తప్పుడు ప్రకటనలు చేశారు. తన ఆరోగ్యం గురించి అబద్ధాలు చెప్పారు' అని ఆరోపించారు. ఈ ఆరోపణలను కేజ్రీవాల్ తరపున న్యాయవాది తోసిపుచ్చారు. కేజ్రీవాల్ ఆరోగ్యం బాగాలేదని, ఆయనకు చికిత్స అవసరమని చెప్పారు. బెయిల్ కాలాన్ని పొడిగించాలని న్యాయస్థానాన్ని కోరారు.

అంతకుముందు మెహతా వాదిస్తూ 'సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో ఆయన లొంగిపోతారని ఉంది. ఇప్పటివరకు ఆ ఉత్తర్వులు సవరించలేదు. ఆయన లొంగిపోవాల్సిందే. ఈ కోర్టు తీర్పు కారణంగా ఆయనకు మధ్యంతర బెయిల్ ఇవ్వలేదు. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే మధ్యంతర బెయిల్ లభించింది. సుప్రీంకోర్టు ఆదేశాల పొడిగింపును ఆయన కోరుతున్నారు. ఇది ఆమోదయోగ్యం కాదు. సాధారణ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఆయనకు ఉన్నది తప్ప తాత్కాలిక బెయిల్ పొడిగించేలా కోరేందుకు కాదు. ఆరోగ్యం బాగాలేదనే వ్యక్తి... బయటకు వచ్చినప్పటి నుంచి నిమిషం, రెండు నిమిషాలు కాదు... గంటల కొద్దీ ప్రచారం చేశారు. వైద్య నివేదికలు ఆలశ్యం చేసి కోర్టును మోసం చేయాలని చూస్తున్నారు. పరీక్షలు అవసరమైతే జైల్లో అందుకు వసతులు కల్పిస్తారు. కావాలంటే ఎయిమ్స్‌కు లేక ఇతర ఆసుపత్రికి పంపుతారు. నేను చచ్చిపోతాను... మూత్రపిండాలు పనిచేయకపోవచ్చు అని చెప్పే వ్యక్తి మే 25 నుంచి ఇప్పటివరకు ఎందుకు ప్రాథమిక పరీక్షలు చేయించుకోలేదు? న్యాయస్థానంతో ఆటలాడుతున్నారా? ఆయన విన్నపాన్ని అంగీకరించవద్దు' అని అన్నారు. దీనికి కేజ్రీవాల్ తరపు న్యాయవాది స్పందిస్తూ 'మధ్యంతర బెయిల్ లభించింది ప్రచారం చేసేందుకే కాబట్టి అనారోగ్యంగా ఉన్నప్పటికీ ఆప్ నాయకుడు ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచార ఒత్తిడి ఆయన మధుమేహాన్ని మరింత పెంచింది. ఇప్పుడు పరీక్షలు చేయించుకోకుండా జైలుకు వెళితే కేజ్రీవాల్‌కు ముప్పు పొంచివుంటుంది' అని అన్నారు.

కాగా, మే 10న కేజ్రీవాల్‌కు 21 రోజుల మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు అనుమతిచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తుదిదశ పోలింగ్ ముగిసిన మరుసటి రోజు అనగా జూన్ 2వ తేదీన లొంగిపోవాలని సూచించింది. కేజ్రీవాల్ తీహార్ జైలు నుంచి విడుదలైన తర్వాత ఉత్తరప్రదేశ్, పంజాబ్, దిల్లీ, మహారాష్ట్రలో ప్రచారం చేశారు.

మూడోసారీ మోదీనేనా!

(మొదటిపేజీ తరువాయి)

మధ్య నిలుస్తుందని, ఇతర పార్టీలకు దాదాపు 36 స్థానాలు వస్తాయని అంచనా వేశాయి.

రాజస్థాన్, పంజాబ్‌లో కాంగ్రెస్ మెరుగు

యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ ప్రకారం రాజస్థాన్‌లో కాంగ్రెస్ మెరుగైన పనితీరు కనబరిచినట్లు పేర్కొంది. 2019 తరహా ఫలితాలు పునరావృతమయ్యే అవకాశం లేదని తెలిపింది. ఇండియా కూటమి 5 నుంచి 7 సీట్లు సాధిస్తుందని వెల్లడించింది. పంజాబ్‌లోని 13 స్థానాల్లో కాంగ్రెస్ 7 నుంచి 9 సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది. అతి చిన్న రాష్ట్రమైన గోవాలో ఎన్‌డీఏ, ఇండియా కూటమి ఒక్కో సీటు గెలుచుకుంటాయని అంచనా వేసింది. జార్ఖండ్‌లో ఈసారి జేఎంఎం-కాంగ్రెస్‌తో కూడిన ఇండియా కూటమి గతసారి కంటే 11 శాతం పెరిగి 41 శాతం ఓట్లను సాధించే అవకాశం ఉంది. కర్నాటకలో కాంగ్రెస్ ఓట్ల శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు, కేరళలో కూడా ఇండియా కూటమి మంచి విజయం సాధిస్తుందని అంచనా వేశాయి. ఇక్కడ యూడీఎఫ్ 17 నుంచి 18 స్థానాలు దక్కించుకుంటుందని పేర్కొన్నాయి. ఎన్‌డీఏ కు కేవలం 2 నుంచి 3 స్థానాలు మాత్రమే వస్తాయని తెలిపాయి.

తమిళనాడులో 'ఇండియా'దే హవా

ఎగ్జిట్ పోల్స్ అంచనాల ప్రకారం, దక్షిణాది రాష్ట్రం తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాల్లో అధికార డీఎంకే 20-22 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని అంచనా. మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు 6-8 సీట్లు వచ్చే అవకాశం ఉంది. అయితే సొంతంగా ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీ కూడా 1 నుంచి 3 సీట్లు గెలుస్తుందని అంచనా.

పీఓకే విదేశీ భూభాగం

ఇస్లామాబాద్ హైకోర్టుకు తెలిపిన పాకిస్థాన్

ఇస్లామాబాద్: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) విదేశీ భూభాగమని పాకిస్థాన్ ప్రభుత్వం ఇస్లామాబాద్ హైకోర్టులో అంగీకరించింది. అక్కడ పాకిస్థాన్ చట్టాలు చెల్లబోవని చెప్పింది. పాత్రికేయుడి కిడ్నాప్ కేసుపై శుక్రవారం విచారణ సందర్భంగా పాకిస్థాన్ అదనపు అటార్నీ జనరల్ ఇస్లామాబాద్ కోర్టులో ఈ మేరకు వ్యాఖ్యానించారు. రావల్పిండిలోని తన ఇంట్లో ఉన్న అహ్మద్ ఫర్హద్ షా అనే పాత్రికేయుడిని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థ మే 15న కిడ్నాప్ చేసింది. దీనిపై ఆయన భార్య అక్కడి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మోసిన్ అక్తర్ కయాని నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. అహ్మద్ ఫర్హద్‌ను కోర్టు ఎదుట ప్రవేశపెట్టాలని ఆదేశించింది. ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన అదనపు అటార్నీ జనరల్... ప్రస్తుతం అహ్మద్ 'పీవోకే'లో పోలీస్ కస్టడీలో ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. అది విదేశీ భూభాగమని, అక్కడ ప్రత్యేక రాజ్యాంగం, చట్టాలు ఉంటాయని, పాకిస్థాన్ చట్టాలు చెల్లబోవని చెప్పారు. అందువల్ల అతడిని కోర్టు ఎదుట ప్రవేశపెట్టడం కుదరదని వివరించారు. దీనిపై స్పందించిన జస్టిస్ కయానీ... ఒకవేళ పీవోకే విదేశీ భూభాగమైతే పాకిస్థాన్ రేంజర్లు, పాక్ మిలటరీ ఎందుకు ఆ ప్రాంతంలోకి చొరబడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యులను విచారణ పేరుతో ఇంటెలిజెన్స్ సంస్థలు బలవంతంగా నిర్బంధించడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. మరోవైపు పాక్ న్యాయవాది వ్యాఖ్యలతో భారత్‌కు మరింత బలం చేకూరినట్లయింది. 'పీవోకే' భారత్‌లో అంతర్భాగమని, అది 1947 నుంచి పాక్ ఆక్రమణలో ఉందని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. పీవోకే ఎప్పటికీ భారత్‌తోనే ఉంటుందని, అది భారత్‌లోనే ఉంటుందని వివిధ సందర్భాల్లో ఆయన నొక్కి చెప్పారు.

ఓటర్ల నాడి తెలుసుకోవడంలో ఇండియా కూటమి విఫలం : మోదీ

న్యూదిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తుది దశ పోలింగ్ ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ హడావిడి మొదలైంది. ఎన్డీయేకు అనుకూలంగా కొన్ని ఎగ్జిట్ పోల్స్ వచ్చాయి. దీంతో ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఇండియా కూటమిని అవకాశవాదిగా విమర్శించారు. ఓటర్ల నాడి తెలుసుకోవడంలో విఫలమైందని ఎగ్జిట్ పోల్స్ తేల్చాయన్నారు. ఇండియా కూటమి కులవాది, మతవాది, అక్రమైనదని మోదీ విమర్శించారు. దేశ భవిష్యత్ కోసం విజన్‌ను అందించడంలో విఫలమైందన్నారు. వారసత్వ కబంధ హస్తాల్లో చిక్కి దేశానికి దిక్సూచి కాలేకపోయిందని విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రచారం మొత్తం మోదీని దూషించడంతోనే సరిపెట్టిందని, ఇలాంటి తిరోగమన రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తారని వ్యాఖ్యానించారు. ఎన్డీయేకు భారతీయులంతా ఓటేశారని, ఓటేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలని మోదీ ట్వీట్ చేశారు. 'భారత్ ఓటేసింది! ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. వారి భాగస్వామ్యం ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. వారి నిబద్ధత ప్రజాస్వామ్య స్ఫూర్తికి హామీ. నారీశక్తి, యువశక్తికి ప్రత్యేక అభినందనలు. ఎన్నికల్లో వారి భాగస్వామ్యం ప్రోత్సాహకరం' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం రావాలని రికార్డు ఓటింగ్ జరిగిందని విశ్వాసంగా చెప్పారు. ట్రాక్ రికార్డు ఆధారంగానే ప్రజా తీర్పు రాబోతోందని అన్నారు.

సుప్రీంను ఆశ్రయించిన పిన్నెల్లి బాధితుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బాధితుడు, పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు శనివారం సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తనకు ప్రాణహాని ఉందని కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. పిన్నెల్లికి హైకోర్టు ఇచ్చిన అరెస్టు మినహాయింపు ఆదేశాలు రద్దు చేయాలని కోరాడు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మే 13వ తేదీ ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో అడ్డుకున్న తనపై పిన్నెల్లి, ఆయన అనుచరులు దాడి చేశారని వివరించాడు. కౌంటింగ్ రోజు కూడా హింసకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నాడు. ఈవీఎం ధ్వంసం ఘటనపై శేషగిరిరావు మరో పిటిషన్ దాఖలు చేశాడు. ఆధారాలున్నా ఎమ్మెల్యే పేరు, అనుచరుల పేర్లు లేకుండా కేసు పెట్టారని, గుర్తు తెలియని వ్యక్తులంటూ ఎమ్మెల్యేకు అనుకూలంగా వ్యవహరించారని పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ అంశాలన్నీ హైకోర్టు పరిగణనలోకి తీసుకోకుండా ముందస్తు బెయిల్ ఇచ్చిందని వివరించాడు. తీవ్ర ఘటనలైనా పట్టించుకోకుండా బెయిల్ మంజూరు చేయడం ఆందోళన కలిగిస్తోందని, మాచర్ల నియోజకవర్గంలో ప్రతిపక్షాలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదన్నాడు. శేషగిరిరావు దాఖలు చేసిన రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టనుంది.

ఏబీ వెంకటేశ్వరరావుకు జన చైతన్య వేదిక అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాలుగేళ్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వేధింపులకు, కక్ష సాధింపులకు గురై, రెండుసార్లు సస్పెన్షన్‌ను ఎదుర్కొని న్యాయ పోరాటంలో విజయం సాధించి తిరిగి యూనిఫాంలో పదవీ విరమణ చేసిన డీజీపీ కేడర్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి శనివారం అభినందించారు. విజయవాడలోని ఆయన స్వగృహానికి వెళ్లి శాలువతో, పుష్పమాలతో సత్కరించారు. వల్లంరెడ్డి మాట్లాడుతూ ఏబీ ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో విద్వేష రాజకీయాలను ప్రోత్సహించిందని, ప్రత్యర్థులను వెంటాడి, వేటాడేతత్వాన్ని కలిగి ఉందని, భావ ప్రకటన స్వేచ్ఛ కరువైందని, అవినీతికి మారుపేరుగా మారిందన్నారు. నాలుగేళ్లుగా ఎలాంటి చార్జిషీట్ వేయకుండా, ఆధారాలు చూపకుండా నిజాయితీకి మారుపేరుగా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేయడం కక్షకు సాధింపునకు పరాకాష్ట అని అన్నారు. రాష్ట్రంలో పౌర సంస్థలన్నిటిని సమన్వయపరచి ప్రజల సమస్యల పరిష్కారంలో ఏబీ కీలక భూమిక వహించాలని ప్రశంసించారు.

సరుకు రవాణాలో

విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

221 నౌకల ద్వారా 85,81,927 మెట్రిక్ టన్నులు...

నిర్వహణ సామర్థ్యానికిది నాంది: చైర్మన్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఈ ఏడాది మేలో సరుకు రవాణాలో కొత్త రికార్డులను నెలకొల్పింది. 90 ఏళ్ల పోర్టు చరిత్రలో వ్యాపార భాగస్వాముల సౌజన్యంతో పాత రికార్డులను తిరగరాసింది. 221 నౌకల ద్వారా మేలో 85,81,927 మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి రికార్డు బద్దలకొట్టింది. మార్చిలో 201 నౌకల ద్వారా చేసిన 76,22,732 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా ఇప్పటివరకు ఒక నెలలో పోర్టు చేసిన అత్యధిక సరుకు రవాణాగా ఉంది. 48 నౌకల ద్వారా 22,35,891 మెట్రిక్ టన్నుల కోల్, కోక్‌ను పోర్టు దిగుమతి చేసుకుంది. గతంలో జులై, 2002లో 21,39,771 మెట్రిక్ టన్నుల కోల్ కోక్ దిగుమతులే అత్యధికంగా ఉండేది. 13 క్రూడ్ ట్యాంకర్ల ద్వారా 14,27,223 మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్‌ను పోర్టు నిర్వహించింది. మార్చి, 2024లో చేసిన 14,24,787 మెట్రిక్ టన్నులే అత్యధిక క్రూడ్ ఆయిల్ రవాణాగా ఉండేది. కంటైనర్ సరుకు రవాణాలో 53 నౌకల ద్వారా 70,539 టీఈయుల కంటైనర్ల ను ఎగుమతి చేసింది. ఆగస్టు, 2023లో 67,636 టీఈయుల కంటైనర్‌ల హ్యాండ్లింగ్ ఇప్పటి వరకు అత్యధిక కార్గో హ్యాండ్లింగ్‌గా ఉండేది. మూడు నౌకల ద్వారా 5,04,815 మెట్రిక్ టన్నుల బాక్సైటును దిగుమతి చేసుకున్నారు మార్చి, 2024లో చేసిన 2,64,630 మెట్రిక్ టన్నుల బాక్సైట్ దిగుమతులే ఇప్పటివరకు ఒక నెలలో అత్యధిక బాక్సైటు దిగుమతిగా రికార్డులో ఉండేది. 17 నౌకల ద్వారా 4,37,270 మెట్రిక్ టన్నుల మ్యాంగనీస్ ఓరును రవాణా చేశారు. జూలై, 2023న 3,66,752 మెట్రిక్ టన్నుల మాంగనీస్ ఓరు నిర్వహణ అత్యధిక సరుకు రవాణాగా ఉండేది. ఐదు నౌకల ద్వారా 3,08,213 మెట్రిక్ టన్నుల లైమ్ స్టోన్‌ను దిగుమతి చేశారు . మే , 2022న చేసిన 2,13,170 మెట్రిక్ టన్నుల లైన్ స్టైల్ ఇప్పటివరకు రికార్డుగా ఉండేది. మేలో 1,405 రేక్స్‌ను సరుకు రవాణా కోసం వినియోగించారు. జనవరి, 2024న వినియోగించిన 1,300 రేక్స్ ఇప్పటివరకు రికార్డుగా ఉంది. విశాఖ పోర్టు మేలో సాధించిన రికార్డులపై పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సంతోషం వ్యక్తం చేశారు. ఈ రికార్డులు మన నిర్వహణ సామర్థ్యాన్ని తెలియజేస్తుందని చెప్పారు. సముద్రయాన రంగంలో నూతన రికార్డులను సృష్టించడంలో మరింత శ్రమించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

డయేరియా మరణాలు ఆందోళనకరం

ప్రభుత్వ యంత్రాంగం వెంటనే దృష్టిపెట్టాలి: చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడలో డయేరియాతో వారం రోజుల వ్యవధిలో 9 మంది చనిపోవడంపై టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. డయేరియా బారిన పడి ఇప్పటి వరకు 9 మంది చనిపోగా.. బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కలుషిత నీరు సరఫరా కారణంగానే ప్రజల ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చిందని, దీనిపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. డయేరియాతో కాకుండా ఇతర అనారోగ్య కారణాలతో వీరంతా చనిపోయారని అధికారులు చెప్పడం సరికాదన్నారు. కలుషిత నీటికి సంబంధించి ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని చంద్రబాబు కోరారు.

నేడు 'అవినీతి చక్రవర్తి నరేంద్ర మోదీ' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'అవినీతి చక్రర్తి నరేంద్ర మోదీ' (ఎలక్టోరల్ బాండ్స్ స్కామ్‌లో కొద్ది భాగం) పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో జరగనుంది. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక-ఆంధ్రప్రదేశ్ అధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో రచయిత పరకాల ప్రభాకర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. సభకు రైతు సంఘం నాయకుడు వై.కేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. వివిధ రాజకీయ, రైతాంగ సంఘ నేతలు ఎన్.రఘువీరారెడ్డి, విస్సా కిరణ్‌కుమార్, కేవీవీ ప్రసాద్, సింహాద్రి ఝాన్సీ, చుండూరి రంగారావు, డి.హరినాథ్, డాక్టర్ కొల్లా రాజమోహన్, సి.భాస్కరరావు ప్రసంగిస్తారు.

చంద్రబాబు విదేశీ పర్యటనపై గోప్యతెందుకు? జోగి రమేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు విదేశీ పర్యటన గోప్యంగా ఉంచడంలో మతలబు ఏమిటని రాష్ట్ర మంత్రి జోగి రమేశ్ సూటిగా ప్రశ్నించారు. ఎన్నిసార్లు అడిగినా చంద్రబాబు విదేశీ పర్యటనపై టీడీపీ ఎందుకు సమాధానం చెప్పడంలేదని నిలదీశారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన అనంతరం విదేశాల్లో పర్యటించిన చంద్రబాబు... అసలు ఏ దేశానికి వెళ్లాడో అంతుచిక్కడం లేదన్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ తొలుత అమెరికాకు వెళ్తున్నట్లుగా లీక్‌లు ఇచ్చి... ఎక్కడకు మాయమైపోయారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అమెరికాకు రాలేదని టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం నాయకుడు కోమటి జయరామ్ ప్రకటించారని గుర్తుచేశారు. దోచుకున్న డబ్బును ఏ దేశంలో దాచుకునేందుకు చంద్రబాబు వెళ్లారన్నారు. ఏ దేశమెళ్లినా ఫొటోలు దిగే అలవాటున్న చంద్ర బాబు, ఇప్పుడు ఎందుకు బయటకు పంపలేదని ప్రశ్నించారు. ఈ పది రోజులపాటు ఏమైపోయావని, నీ పర్యటనపై ఎందుకింత దాపరి కమని అన్నారు. నీ పర్యటనపై రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉంది కదా? ఎందుకింద దాపరికమని చెప్పారు. సీఎం జగన్ తన పర్యటనను నేరుగా ప్రకటించి లండన్‌కు కుటుంబ సమేతంగా వెళ్లి వచ్చారన్నారు. జగన్ పర్యటన బహిరంగంగా జరిగిందని వివరించారు. చంద్రబాబు ఏ దేశం వెళ్లాడు, వైద్య పరీక్షల కోసం వెళ్లాడా, విహార యాత్రల కోసం వెళ్లాడా చెప్పాలంటూ జోగి రమేశ్ డిమాండ్ చేశారు. ఏబీ వెంకటేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా టీడీపీ నేతలంతా వెళ్లి ఆయనకు సన్మానం చేసిన ఉదంతాన్ని చూశామన్నారు. నిఘా విభాగం పరికరాల కొనుగోలులో ఏబీ పాత్ర ఉందని కేంద్ర ఇంటిలి జెన్సీ నిర్ధారించారా లేదా అని అన్నారు. కేంద్ర హోంశాఖ ఏబీపై విచారణకు అనుమతించిందని చెప్పారు. ఒక పోలీసు అధికారిగా ఉంటూ... లోపల టీడీపీ ముద్ర వేసుకోవడం దురదృష్ట కరమన్నారు. ఏబీ చరిత్ర ప్రజలకు తెలియదా అని అన్నారు. ఎగ్జిట్ పోల్స్‌తోనే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి దిమ్మతిరుగుతోందని చెప్పారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో చంద్రబాబుకు దిమ్మ తిరగబో తుందని, బొమ్మ కన్పించనుందని పేర్కొన్నారు. నాల్గోతేదీన ఎన్నికల ఫలితాలతో చంద్రబాబు ఆసుపత్రికి వెళ్లడం తథ్యమని చెప్పారు. వైసీపీ శ్రేణులంతా సంబరాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మళ్లీ జగన్‌ను సీఎంగా చేసుకునేందుకుగాను ప్రమాణ స్వీకారోత్సవానికి ఎదురు చూస్తున్నామని మంత్రి జోగి చెప్పారు.

బందరు పోర్టు నిర్మాణ పనుల పరిశీలన

'బెర్త్' వివరాలు అడిగి తెలుసుకున్న రామకృష్ణ

విశాలాంధ్ర-మచిలీపట్నం: బందరు పోర్ట్ నిర్మాణ పనులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ శనివారం పరిశీలించారు. దీనిలో భాగంగా పోర్ట్‌లో జరుగుతున్న బెర్త్ పనుల వివరాలను అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంగినపూడి బీచ్‌ను సందర్శించారు. భాస్కర్‌పురంలో నివశిస్తున్న సీపీఐ సీనియర్ నాయకురాలు దేవభక్తుని నిర్మలను కలిసి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. మోదుమూడి రామారావు, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు పమిడిముక్కల రాణి, ఏఐటీయూసీ నాయకులు యర్రంశెట్టి ఈశ్వరరావు పోర్టును సందర్శించిన వారిలో ఉన్నారు.

సజ్జలపై ఎఫ్ఐఆర్‌తో వైసీపీకి వణుకు: అశోక్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సజ్జల రామకృష్ణారెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదవడం వైసీపీ నేతలకు షాక్‌గా మారిందని టీడీపీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఎక్కడ దూరం అవుతారోనని వైసీపీ సొంత పేపర్‌లో చంద్రబాబుపై తప్పుడు రాతలకు పూనుకున్నారని మండిపడ్డారు. ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ అన్నట్లుగా వ్యవహరిస్తోందన్నారు. చీఫ్ ఏజెంట్ల సమావేశానికి చంద్రబాబు రాకుండానే వచ్చినట్లు తప్పుడు రాతలు రాయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు హైదరాబాద్‌లో ఉన్నారని చెప్పారు. అచ్చెన్నాయుడు రావాల్సి ఉండగా అనారోగ్యంతో ఆయన రాలేదన్నారు. సజ్జలకు దమ్ముంటే చంద్రబాబు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మాట్లాడారని నిరూపించాలన్నారు. సజ్జల పతనం మొదలైందని హెచ్చరించారు. ఈనెల నాలుగో తేదీ తర్వాత వైసీపీలో మార్పు అవసరమని చెప్పారు. గుడపాటి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, సజ్జలపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నివేదిక ఇచ్చామని వివరించారు.

ఎగ్జిట్‌లో మాకు పాజిటివ్ ఓటింగ్: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీరియస్ సర్వే సంస్థల ఎగ్జిట్‌లో తమకు మహిళలతోపాటు పాజిటివ్ ఓటింగ్ కనిపిస్తున్నదని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. వైసీపీకి అర్బన్, రూరల్‌లో సైలెంట్ ఓటు ఉంటుందని వివరించారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయం వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల నాలుగవ తేదీన జరిగే కౌంటింగ్‌లో ఎగ్జిట్ పోల్స్ కంటే... ఇంకా మంచి ఫలితాలు వస్తాయని తాము భావిస్తున్నామన్నారు. కుటుంబం అంతా ఒకే రకంగా ఉంటుందని, ఎక్కడైనా మహిళలు ఒకరికి, కుటుంబ సభ్యులు మరొకరికి వేసిన సందర్భాలు ఉంటాయని ఆయన తెలిపారు. సీఎం జగన్ ప్రభుత్వ హయాంలో మహిళలకు ఆర్థిక వెసులుబాటు బాగా వచ్చిందని, దీంతో ఆ కుటుంబంపై ఒక నిర్ణయం తీసుకునే హక్కు ఆమెకు కలిగిందన్నారు. దానివల్ల మహిళల్లో స్థిరత్వం వచ్చిందని, వారి ఆత్మగౌరవం పెరిగిందని వివరించారు. పిల్లల చదువుల దగ్గర నుంచి వైద్యం వరకు, కుటుంబ వ్యవహారాలను మహిళల చూసుకోగలిగారని చెప్పారు. ఇంటి పట్టాలను సైతం మహిళలకు ప్రభుత్వం ఇచ్చిందని, దీంతో జగన్ ఉంటేనే మళ్లీ సంక్షేమం కొనసాగుతుందని వారితోపాటు ప్రజల్లో ఒక బలమైన నమ్మకం కలిగిందన్నారు. దీంతోనే మహిళలు ఓట్లలో ఎక్కువ చొరవ చూపినట్లు తాము భావిస్తున్నామన్నారు. మహిళలు పోలింగ్ బూత్‌కు వచ్చారంటే... వారితోపాటు కుటుంబ సభ్యులూ ఉంటారని చెప్పారు. తమ ఎన్నికల ప్రచారంలో ఈ ఐదేళ్లల్లో ఏం చేశామనేదీ ప్రజల ముగింటకు తీసుకెళ్లామన్నారు. ఎప్పుడైతే చంద్రబాబు అసాధ్యమైన హామీలిచ్చారో... దానిని తిప్పికొట్టామని చెప్పారు. సొంతంగా పోటీ చేయలేని పరిస్థితుల్లో అన్ని శక్తులను ఏకం చేసుకుని వారొచ్చారని గుర్తుచేశారు. సీఎం జగన్ పాజిటివ్ ఓటింగ్ లక్ష్యంతోనే ముందుకెళ్లారని సజ్జల స్పష్టంచేశారు.

12న పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి

ప్రవీణ్ ప్రకాశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు ఈనెల 12న విద్యా సామగ్రి పంపిణీ చేస్తామని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ శనివారం ఓ ప్రకటనలో పునరుద్ఘాటించారు. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రిలో భాగంగా అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలతోపాటు టోఫెల్ వర్క్‌బుక్, ఫ్యూచర్ స్కిల్స్ సబ్జెక్ట్ టెక్స్టుబుక్‌లతో పాటు మూడు జతల యూనిఫామ్, స్కూల్ బ్యాగులు, బెల్ట్, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు అందజేస్తామన్నారు. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు వర్క్‌బుక్‌లు, ఆరు నుంచి 10 తరగ తుల వారికి నోట్‌బుక్‌లు, బూట్లు అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు.

20 ఏళ్లు దాటితే అసైన్డ్ భూములు అమ్ముకోవచ్చు

కలెక్టర్ మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: అసైన్డ్ భూములకు అతి తక్కువ ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు ఇచ్చిన జిల్లా విశాఖేనని కలెక్టర్ మల్లికార్జున చెప్పారు. కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది లక్షల ఎకరాల భూమి ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లకు అర్హత పొందగా, విశాఖ జిల్లాలో 702 ఎకరాలు మాత్రమే ఉన్నట్టు వెల్లడించారు. అసైన్డ్ భూ ములు పొందిన రైతులు 20 ఏళ్లు గడిచాక ఎవరికైనా, ఎప్పుడైనా అమ్ముకోవచ్చని స్పష్టం చేశారు. వీఎంఆర్డీయే ల్యాండ్ పూలింగ్ కింద విశాఖలో చాలా వరకు అసైన్డ్ భూములు తీసుకోగా, ఎలాంటి పత్రాలు లేని ఇద్దరు వ్యక్తులు కోర్టుకు వెళ్లారని తెలిపారు. ప్రభుత్వ భూమిని రక్షించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. విశాఖలో విలువైన అసైన్డ్ భూముల అప్పగింతలో కలెక్టర్ మల్లికార్జునపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ పెద్దలకు తలొగ్గి పనిచేశారని ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ జవహర్ రెడ్డి బినామీలతో విశాఖలో 800 ఎకరాలు అసైన్డ్ భూములు కాజేశారని జనసేన నేత మూర్తి యాదవ్... రోజూ బహిరంగంగా ఆరోపిస్తూనే ఉన్నారు. విపక్షాలు కూడా ఈ భూదందాపై సమగ్ర విచారణ జరపాలని గవర్నర్‌కు ఫిర్యాదు చేశాయి. ఈ భూపందేరానికి కలెక్టర్ మల్లికార్జున సూత్రదారి అని రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీలు నేతలు, దళిత సంఘాలు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

విశాఖ జిల్లాలో సుమారు రెండు వేల అసైన్డ్ భూములు ఉన్నప్పటికీ కొంత మంది మాత్రమే 596 జీవో ప్రకారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను తన అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ పరిశీలించి, జీవోలో మార్గదర్శకాలు అనుసరించి తహసీల్దార్ కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ వరకు అన్ని స్థాయిల్లోనూ డాక్యుమెంట్లు పక్కాగా తనిఖీ చేసి అన్ని సక్రమంగా ఉంటేనే ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్ ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇలా గత ఎనిమిది నెలల్లో సుమారు 702 ఎకరాల వరకు అనుమతులు మంజూరు చేశామన్నారు. రాష్ట్రం మొత్తంమీద సుమారు 9.1 లక్షల ఎకరాల వరకు అసైన్డ్ భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డు ప్రకారం తెలుస్తోంది. ఇందులో అత్యధికంగా చిత్తూరులో 1.64 లక్షల ఎకరాలు, సత్యసాయి జిల్లాలో 1.38 లక్షల ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 1.05 లక్షల ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 97 వేల ఎకరాల అసైన్డ్ భూ ములకు ఆయా జిల్లా కలెక్టర్లు నిషిద్ధ జాబితా నుంచి తొలగించి దళితులకు ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించారు. అలాగే ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళంలో 12,230 ఎకరాలు, విజయనగరంలో 6,100 ఎకరాలకు ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. రాష్ట్రంలో అత్యల్పంగా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 506 ఎకరాలకు ఇవ్వగా, ఆ తరువాత స్థానంలో తక్కువగా కేవలం 702 ఎకరాలకు మాత్రమే విశాఖ కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చినట్లు సమాచారం. అయితే విశాఖ జిల్లాలో భోగాపురం ఎయిర్ పోర్టు సమీప మండలాల్లో విలువైన భూములను కొంతమంది పెద్దలు దళారుల ద్వారా చేజిక్కించుకునేందుకు అసైన్డ్ భూముల అస్త్రాన్ని వాడారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే జాయింట్ కలెక్టర్ గా ఉన్న విశ్వనాథను ఆకస్మిక బదిలీకి శ్రీకారం చుట్టారని ప్రచారం జరుగుతోంది.

అర్బన్‌లో అనుమతులు ఇవ్వలేదు

జిల్లాలో గ్రామీణ ప్రాంతంలోనే కాకుండా అర్బన్‌లో కూడా అసైన్డ్ భూములు ఉన్నాయి. ప్రభుత్వ జీవోలో కూడా అర్బన్, రూరల్ అనే ప్రస్తావన లేకుండా అన్నింటికి సంపూర్ణ హక్కులు కల్పించాలని ఉంది. అయినప్పటికీ అర్బన్‌లో కొన్ని భూములకు సంబంధించి వివాదాలు, భవిష్యత్తు అవసరాలు ఇలా పలు అంశాలను పరిగణనలోకి తీసుకొని అర్బన్‌లో భూములను నిషిద్ధ జాబితా నుంచి తొలగించకూడదని భావించారు. రూరల్లో ఉన్న అసైన్డ్ భూములకు ముందుగా ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో పెందుర్తి, భీమిలి, ఆనందపురం గ్రామీణ ప్రాంతాల్లోను, పద్మనాభంలో ఉన్న అసైన్డ్ భూములకు సంబంధించిన దరఖాస్తులను తొలుత పరిష్కరిస్తున్నారు. అర్బన్‌కు సంబంధించి ఒక్క ఎకరం అసైన్డ్ భూమికి కూడా అనుమతులు ఇవ్వలేదు.

పోస్టల్ బ్యాలెట్‌పై వైసీపీ పిటిషన్ తిరస్కృతి

ఈసీ వాదనలు సమర్థించిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో చీఫ్ ఎలక్షన్ కమిషన్ (సీఈసీ) ఆదేశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వైసీపీ వేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఫామ్-13ఏపై అటెస్టెడ్ అధికారి పేరు, వివరాలు లేకున్నా ఓటు చెల్లుతుందని సీఈసీ ఆదేశాలిచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకముంటే సరిపోతుందని స్పష్టంచేసింది. దీంతో సీఈసీ ఉత్తర్వులు చట్టవిరుద్ధంగా ఉన్నాయని, దేశ వ్యాప్తంగా ఒక విధానం ఉంటే, ఏపీలో మాత్రం కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారని వైసీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఈసీ ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టులో ఆ పార్టీ నాయకులు లేళ్ల అప్పిరెడ్డి ఇటీవల హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనివల్ల చెల్లని ఓట్లు కూడా పరిగణలోకి తీసుకునే అవకాశముందని, కౌంటింగ్‌లో ఏజెంట్ల మధ్య ఘర్షణలకు దారితీసే అవకాశముందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వాదోపవాదనలు అనంతరం శనివారం సాయంత్రం హైకోర్టు తీర్పు ఇచ్చింది. సీఈసీ ఇచ్చిన వాదనలను పరిగణలోకి తీసుకుని వైసీపీ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈనెల నాలుగో తేదీన ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు వైసీపీకి షాక్‌గా మారింది. ఇటీవల పోస్టల్ బ్యాలెట్ అంశంపై రాష్ట్రంలో వివాదం నెలకొంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (ఏపీ సీఈవో) ఎన్డీఏ కూటమికి ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరి స్తున్నారని వైసీపీ నేతలు ఆరోపించారు. ఇందులో భాగంగానే సీఈవో హడావుడిగా పోస్టల్ బ్యాలెట్ ఓటుపై అధికారి సీల్, హోదా, వివరాలు లేకపోయినా కేవలం సంతకం ఉంటే సరిపోతుందని ఆదేశాలిచ్చిందని విమర్శించారు. దీనిపై సీఈసీకి వైసీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి లేఖ కూడా రాశారు.

సంపాదకీయం

పోరాటం మిగిలే ఉంది

సార్వత్రిక ఎన్నికల తుది దశ పోలింగ్ శనివారం సాయంత్రం ఆరు గంటలకు ముగిసింది. దాదాపు అదే సమయంలో కన్యాకుమారికి దగ్గరలో ప్రధానమంత్రి మోదీ 48 గంటల ధ్యానం కూడా ముగిసింది. పోలింగ్ ముగిసిన కొద్ది సేపటికే ఎగ్జిట్‌పోల్ ఫలితాలు వెలువడడం మొదలైంది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఆఖరి దశ పోలింగ్ పూర్తి అయిన తరవాత వెలువరించడం పరిపాటి అయింది. ఇవి కచ్చితంగా ఎన్నికల ఫలితాలను ప్రతిబింబిస్తాయని చెప్పలేం. ఈసారి సుదీర్ఘంగా ఏడు విడతల పోలింగ్ జరిగింది. ఒక్కో విడత పోలింగ్ ముగిసిన తరవాత ఎన్నికల విశ్లేషకులు తమ అంచనాలను తెలియజేశారు. గోదీ మీడియాను మినహాయిస్తే మిగతా వారందరూ మోదీ నాయకత్వంలోని బీజేపీకి వచ్చే స్థానాలు గణనీయంగా తగ్గుతాయనే అంచనా వేశారు. వారి అభిప్రాయాలు పోలింగ్ సరళినిబట్టి వేసిన అంచనాలే కనక అవీ నిక్కచ్చిగా ఉండే అవకాశంలేదు. అంచనావేసే వారి దృక్కోణం అందులో ఇమిడి ఉండవచ్చు. దశలవారీగా అంచనాలనుబట్టి చూసినా ఓటువేసి బయటకు వచ్చిన వారు ఎవరికి ఓటు వేశారో కచ్చితంగా చెప్తారన్న నమ్మకమూ లేదు. గతంలో ఒక్కో దశ పోలింగ్ పూర్తి అయిన తరవాతే ఎగ్జిట్ పోల్స్ వెలువడేవి. కానీ ఇది తరవాతి దశల పోలింగును ప్రభావితం చేస్తుందని ఎన్నికల కమిషన్ పోలింగ్ సంపూర్ణమైన తరవాత తప్ప ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించకూడదు అని కట్టడిచేసింది. కానీ ఒక చోట పోలింగ్ జరుగుతూ ఉంటే పోలింగ్ జరగవలసినచోట ఎన్నికల ప్రచారం కొనసాగుతూ ఉండడం మీద మాత్రం ఏ ఆంక్షా లేకపోవడం విచిత్రమే. అన్నిచోట్లా ఎన్నికల ప్రచారానికి తెరపడిన తరవాత మోదీ కన్యాకుమారి దగ్గరలో ధ్యానం చేయడం సైతం ఇదో రకమైన ఎన్నికల ప్రచారమే కదా! అబ్కీ బార్ 400 పార్ అన్న మోదీ నినాదం ఫలించకపోయి ఉండొచ్చు కానీ దాదాపు వివిధ సంస్థల ఎగ్జిట్ ఫలితాలు ఎన్.డి.ఎ. కూటమి విజయాన్నే సూచిస్తున్నాయి. ఏ ఎగ్జిట్ పోల్ కూడా ఎన్.డి.ఎ.కు 300 కన్నా తక్కువ స్థానాలు వస్తాయని అంచనా వేయలేదు. ఇండియా టుడే-ఆక్సిస్ ఎన్.డి.ఎ.కు 339 నుంచి 365 దాకా, ఇండియా ఐక్య సంఘటనకు 77 నుంచి 108 దాకా సీట్లు వస్తాయని అంచనా వేసింది. న్యూస్ 24-చాణక్య ఎన్.డి.ఎ.కు 350, "ఇండియా"కు 95, న్యూస్ 18-ఐ.పి.ఎస్.ఓ.ఎస్. మోదీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ.కు 336, "ఇండియా" కు 82, టైమ్స్ నౌ-వి.ఎం.ఆర్. సంస్థ ఎన్.డి.ఎ.కు 306 "ఇండియా"కు 132, ఇండియా టీవీ-సి.ఎన్.ఎక్స్. సంస్థ ఎన్.డి.ఎ.కు 300 "ఇండియా"కు 120, సుదర్శన్ న్యూస్ ఎన్.డి.ఎ.కు 305 "ఇండియా"కు 124 వస్తాయని అంచనా వేసింది. అయితే ఏడు విడతల పోలింగ్ క్రమంలో విశ్లేషకుల అంచనాకు ఎగ్జిట్ పోల్ లెక్కలకు పొంతన కుదరడం లేదు. ఓటమి భయం మోదీకి పట్టుకుందన్న వార్తలే మొన్నటి దాకా విన్నాం. లోకసభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ శాసన సభకు కూడా ఎన్నికలు జరిగాయి. శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్ అంచనాల్లో ఎక్కువ భాగం తెలుగు దేశం నాయకత్వంలోని కూటమి విజయం సాధిస్తుందని చెప్తున్నాయి. సహజంగానే వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ కు అనుకూలమైన సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌లో కూడా జగన్ మళ్లీ అధికారంలోకి వస్తాయని అంటున్నాయి. అయితే రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన సంస్థలేవీ ఆ విద్యలో పేరు ప్రఖ్యాతులు ఉన్నవి కావు.

ఎగ్జిట్ పోల్స్ అంచనాలను భిన్న పక్షాలు తమకు అనుకూలంగా ఉన్నప్పుడు ఎగిరి గంతేయడం, ప్రతికూలంగా ఉన్నప్పుడు తూలనాడడం మామూలే. ఈసారి ఎలాగైనా మోదీని ఓడించగలమన్న ధీమాతో రంగంలోకి దిగిన "ఇండియా" ఐక్య సంఘటన నాయకులు ఎగ్జిట్ పోల్ ఫలితాలు రాక ముందే శనివారం మధ్యాహ్నం సమావేశం అయ్యారు. జనాభిప్రాయం సేకరించి తమకు 295 సీట్లు వస్తాయని అనుకుంటున్నామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అంటున్నారు. ఓట్ల లెక్కింపు రోజున ప్రతిపక్షాలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కూడా ఈ సమావేశంలో చర్చించారు. లెక్కింపు ప్రక్రియ మొత్తం పూర్తి అయ్యే దాకా లెక్కింపు కేంద్రాలు వదిలి వెళ్లకూడదని "ఇండియా" నాయకులు తమ కార్యకర్తలను నిర్దేశించారు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడానికి కారణం లేకపోలేదు. ఈ ఎన్నికలలో ఎన్నికల కమిషన్‌కు నాయకత్వం వహిస్తున్న త్రిమూర్తులు వ్యవహరించిన తీరు వారు తమ బాధ్యతను సవ్యంగా నిర్వర్తించలేదన్న అనుమానాలను బలవరిచాయి. ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన సంస్థల్లోనూ మోదీ ప్రభుత్వాన్ని సమర్థించడానికి ఉబలాట పడేవి ఉంటాయి. ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన సంస్థలన్నీ ఏదో ఒక వార్తా సంస్థతో సంబంధం ఉన్నవే. ప్రధాన వార్తా సంస్థలన్నీ మోదీ హయాంలో ఎలా వ్యవహరించాయో చెప్పడం చర్విత చర్వణమే. "ఇండియా" ఐక్య సంఘటన సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్ నేతలెవరూ హాజరు కాలేదు. తుది దశ పోలింగ్‌లో బెంగాల్‌లోని స్థానాలూ ఉండడం దీనికి కారణం కావొచ్చు. మరేదైనా కారణం ఉన్నా ఆశ్చర్య పడక్కర్లేదు. మోదీ నాయకత్వంలో బీజేపీ ఎన్నికల ప్రచారం అంతా ప్రజాసమస్యలను ప్రస్తావించకుండానే జరిగింది. ప్రతిపక్షాలు మాత్రం ప్రజలను కలచివేస్తున్న అనేక సమస్యలను ప్రస్తావించడమే కాక రాజ్యాంగాన్ని పరిరక్షించవలసిన అగత్యాన్ని ప్రజలకు తెలియజెప్పాయి. చాలామంది జనానికి ఈ అంశం అర్థం కావడం అత్యంత సానుకూలమైన అంశం. ఇంతవరకు ఎగ్జిట్‌పోల్స్‌లో చాలాసార్లు జోస్యాలు తప్పిన ఉదంతాలే ఎక్కువ. అత్యంత ప్రసిద్ధమైన సంస్థలు నిర్వహించే, ప్రసిద్ధ ఎన్నికల విశ్లేషకులువేసే అంచనాలు కూడా తప్పడంలో ఆశ్చర్య పడవలసింది ఏమీలేదు. పోలింగ్ శాతంలో హెచ్చు తగ్గులవల్ల అధికార పక్షానికి మేలు జరుగుతుందా, ప్రతిపక్షానికి ప్రయోజనం ఉంటుందా అని తేల్చి చెప్పడానికి కొలమానాలు ఏమీలేవు. ఎగ్జిట్ పోల్ అంచనాలకు అనుగుణంగా అసలు ఫలితాలు ఉంటే మూడోసారి మోదీ అధికారంలోకి వస్తారు. అప్పుడు ప్రతిపక్షాలు ఈసారి ఎన్నికల క్రమంలో ప్రారంభించిన పోరాటాన్ని ఇక ముందు కూడా కొనసాగించవలసి వస్తుంది. అధికారంలో ఉండే ప్రభుత్వాలే రాజ్య వ్యవస్థను, రాజ్యాంగాన్ని కుళ్లబొడుస్తున్నప్పుడు ప్రజలను నిరంతరం అప్రమత్తంచేస్తూ, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి నిరంతరం పాటు పడక తప్పదు.

ప్రకృతి వ్యవసాయానికి పట్టిన ప్రభుత్వ చీడ



కె.వి.వి. ప్రసాద్

ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఎ.పి.సి.ఎన్.ఎఫ్) రైతాంగాన్ని తక్కువ పెట్టుబడితో ఎరువులు, పురుగు మందులు వాడని ప్రకృతి వ్యవసాయం వైపు తీసుకువెళ్ళే లక్ష్యంతో పనిచేస్తున్నది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 10,70,878 మంది రైతులు 12,82,114 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారంతో ముందుకు సాగుతున్న ప్రకృతి వ్యవసాయ విభాగానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రూపంలో ప్రభుత్వ చీడ పట్టింది. ప్రకృతి వ్యవసాయ విభాగంలో వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న 9,352 మంది కార్యకర్తలు, సిబ్బందికి ఇచ్చే గౌరవవేతనం 16 మాసాలుగా అందక వారి కుటుంబాలు ఆర్థిక, మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 2015-16లో ప్రారంభించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను కష్టనష్టాలకోర్చి రైతాంగం ముందుకు తీసుకువెళుతున్నారు.

వ్యవసాయం చేస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించే దిశగా తోటి రైతాంగానికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, స్వయంగా ప్రకృతి సేద్యంపట్ల అవగాహన కల్పించే లక్ష్యంతో రైతులనుండే కార్యకర్తలను ఎంపికచేసి వారికి గౌరవవేతనం చెల్లిస్తూ రైతుసాధికార సంస్థ భాగ స్వామ్యంతో ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఈ కార్యకర్తలు తమ భూముల్లో వివిధ రకాల పంటలు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించటమే గాకుండా తమ గ్రామాలతోపాటు పరిసర గ్రామాలు, మండలాల్లో రైతాంగానికి ఫీల్డ్ లెవల్‌లో మెళకువలు నేర్పిస్తారు. కార్యకర్తల పని సామర్థ్యం బట్టి వారిని కేటగిరీలుగా విభజించి గౌరవవేతనం నిర్ణయిస్తారు. వ్యవసాయశాఖ నుండి డిప్యుటేషన్‌పై వచ్చిన ఎ.డి.ఎ.,ఎ.ఒ.లను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డిపియం)లుగా బాధ్యతలు అప్పగిస్తారు. నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్స్ (యన్.యఫ్.ఎ), మాస్టర్ ట్రైనర్స్(యం.టి) యల్-1,యల్-2,యల్-3 కేటగిరీలుగా విభజించి విధులు నిర్వహింప చేస్తారు. రైతుసాధికార సంస్థ నిర్వాహణలో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులతో చేయిస్తూ నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు అందిస్తూ తాము చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించకుండా తమకు ఇచ్చే గౌరవవేతనాన్ని సంవత్సరానికిపైగా చెల్లించకపోవడంతో కార్యకర్తలు తీవ్ర మనస్థాపానికి గురై విధులుకూడా సక్రమంగా నిర్వహించలేక పోతున్నారు. నెలల పర్యంతం చెల్లింపులు జరగకపోవడంతో ప్రాజెక్టు నిర్వాహణపై అనుమానాలు తలెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ద్వారా స్వచ్ఛంధ సంస్థలు అందించే నిధులు నిలిచిపోయినందున సమస్య తలెత్తిందనే ఊహాగానాలు ఏర్పడ్డాయి. మరోపక్క ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సుమారు 100 కోట్ల రూపాయలు ఈ సంస్థకు చెందిన నిధులను ఇతర ప్రభుత్వ పథకాలకు మళ్ళించడంతో తమకు ప్రతి నెలా రావల్సిన వేతనాలు అందలేదని రకరకాల ఊహ గానాల నేపథ్యంలో ప్రకృతి సేద్యంలో పనిచేస్తున్న కార్యకర్తలు వేదనా భరితులైనారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది కోట్ల రూపాయల అప్పుల్లో మునిగితేలుతున్న దశలో తమ వేతన బకాయిలు ఎప్పటికి అందేనో అనే మీమాంస వెంటాడుతున్నదని వారు మదనపడుతున్నారు. ఈ విషయం తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసి సాధికార సంస్థ సీఈఓతో రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నేను చర్చించి వేతన బకాయిలు వెంటనే వారికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరాను.

అయితే సాధికార సంస్థ ఉన్నతాధికారులు మాత్రం వేతన బకాయిల చెల్లింపుపై భరోసా ఇస్తున్నా తాము నమ్మలేక పోతున్నామన్నారు. అధికారులు మాత్రం పట్టువిడవని విక్రమార్కునిలా ప్రభుత్వం నుండి నిధులు రాకపోయినా ఇతర రూపాలలో నిధులు రాబట్టేందుకు ప్రయత్నాలు చేశారన్నారు. తమకు అనుబంధంగాఉన్న మహిళా సంఘాల నిధులు కార్యకర్తల వేతన బకాయిలకు వినియోగించాలని చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. బ్యాంకుల ద్వారా రుణం పొంది ఖరీఫ్ సీజన్ ముందుగానే బకాయిలు చెల్లించి ప్రకృతి సాగుకు ఎటువంటి అవరోధాలు లేకుండా కార్యకర్తలను సన్నద్ధం చేసేందుకు అధికార యంత్రాంగం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. రుణం ఇచ్చేందుకు బ్యాంకు పెట్టే నిబంధనలు అధిగమించి రుణం పొందటం సాధ్యమా? అన్న అనుమానాలు సైతం లేకపోలేదు. అధికారులు బకాయిల చెల్లింపునకు వీలుగా బ్యాంకు ఎకౌంట్లు ప్రారంభించాలని ఆదేశించి అందుకు తగిన ప్రయత్నాలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో మే 31వ తేదీ జిల్లాల సిబ్బంది, ముఖ్య కార్యకర్తలతో జూమ్ మీటింగ్ నిర్వహించి జూన్ 15లోపు ఆరు మాసాల బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. మరో రెండు మాసాల్లో పూర్తి బకాయిలు చెల్లించే ప్రయత్నాలు చేస్తున్నట్లు కార్యకర్తలకు భరోసా కల్పించారు. ప్రకృతి సేద్య కార్యకర్తల వేతన నిధులు దారి మళ్ళింపు ప్రభావం కార్యకర్తలు, అధికారులను గందరగోళపర్చింది. రైతుసాధికార సంస్థ అధికార యంత్రాంగం, ప్రభుత్వం, బ్యాంకులు మధ్య ఎటువంటి ఆవాంతరాలు లేకుండా నిధుల మంజూరు అయి ప్రకృతి సేద్య కార్యకర్తలకు సకాలంలో వేతన బకాయిల చెల్లింపులు జరగాలని ఆశిద్దాం....

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి
సెల్ :9490952737

అధిక ఉష్ణోగ్రతలతో పంటలకు నష్టం

జనక మోహనరావు దుంగ

ఇన్‌ఫ్లేషన్ (ద్రవ్యోల్బణం) అనే పదం ఇంచుమించు అందరకీ సుపరిచితమే. కాని కొత్తగా 'హీట్‌ఫ్లేషన్' (ఉష్ణద్రవ్యోల్బణం) అనే భావన తెరమీద కొచ్చింది. కాలుష్యంవలన వాతావరణంలో హరిత వాయువులుపెరిగి ప్రపంచ వాతావరణంలో అధికవేడి నమోదవుతుంది. మనదేశంలో కూడా చాలా ప్రాంతాలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు పంటలను దెబ్బతీయడమే కాకుండా కొన్నిసార్లు నాశనం చేస్తాయి. దీని వలన ఆహారపంటల నాణ్యత తగ్గడమేకాక దిగుబడి కూడా తగ్గుతుంది. ఆహార సరఫరా తగ్గిపోవడంతో ఆహార ధాన్యాలకు డిమాండ్ ఎక్కువై ధరలు పెరగడం ప్రారంభిస్తాయి. ఈ పరిస్థితి ఆహార భద్రతకు ముఖ్యంగా పేదలకు అత్యంత దుర్బలమైన ప్రజలకు పెద్దముప్పు కలిగిస్తుంది. అధిక ఉష్ణోగ్రతల వలన ధరలు పెరగడాన్నే ఉష్ణ ద్రవ్యోల్బణం అంటారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలు అధిక ఉష్ణోగ్రతలు పంటలపై ఏవిధమైన ప్రభావం చూపుతుందో అనేక పరిశోధనలు చేశారు. ఉష్ణోగ్రతలో చిన్న పెరుగుదల అంటే 1.5 డిగ్రీల సెల్సియస్ కూడా పంట దిగుబడిపై గణనీయమైన ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. సాగుచేస్తున్న ప్రాంతంలో ఉష్ణోగ్రతలు పంట మొక్కలలో పెరుగుదల, నాణ్యత, దిగుబడిని చాలా ప్రభావితం చేస్తుంది. ఇది పంట దిగుబడి సామర్థ్యంలో పెనుమార్పులను కలుగజేస్తుంది. సాధారణంగా మనదేశంలో వరి, గోధుమలు, తృణధాన్యాలు, చిరుధాన్యాలు, పండ్లు ఆహార పంటలుగా చెప్తారు. వీటిపై అధిక ఉష్ణోగ్రతలు ప్రభావాన్ని పరిశీలిద్దాం. వరి సాగుకు 25 నుండి 35 డిగ్రీల సెల్సియస్, గోధుమసాగుకు 14 నుండి 18 డిగ్రీల సెల్సియస్, తృణ ధాన్యాలకు సరాసరి 30 డిగ్రీల సెల్సియస్, చిరుధాన్యాలకు సగటు 26 నుండి 29 డిగ్రీల సెల్సియస్ల ఉష్ణోగ్రతలు వాంఛనీయమని వ్యవసాయ నిపుణులు చెబుతారు. ఈ ఉష్ణోగ్రతలు ప్రాంతాలబట్టి కొంచెం అటుఇటుగా మారుతాయి. మొక్కలు చనిపోయే క్లిష్ట ఉష్ణోగ్రతను 'థర్మల్ డెత్ పాయింట్' అంటారు. యాభై డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత అనేక వార్షిక ఆహారపంటలు ఎండిపోయే దశ. విపరీతమైన వేడి పంటలను బహుముఖ మార్గాల్లో నాశనం చేస్తాయి.

అధిక ఉష్ణోగ్రతవల్ల మొక్కలు తెగుళ్లవ్యాధుల బారిన పడతాయి. అదే సమయంలో పంటనాణ్యత, పోషక విలువలును తగ్గిస్తుంది. ఖనిజ పోషణ, రెమ్మల పెరుగుదల, పుప్పొడి అభివృద్ధిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. అధిక వేడి నిర్జలీకరణానికి దారితీస్తుంది. దీని మూలాన ఆకులు మాడిపోతాయి. నైట్రేట్లు తీసుకొనే సామర్థ్యం తగ్గుతుంది. ఫలితంగా తక్కువ దిగుబడి వస్తుంది. దీని ప్రభావం వరి విత్తనాలు మొలకదశ నుండే మొదలవుతుంది. వరి మొక్కలు నిద్రాణస్థితికి చేరుకొని ధాన్యం నాణ్యత, గింజ బరువు తగ్గుతుంది. కొన్నిసార్లు పూర్తిగా పంట చనిపోవడానికి కూడా అవకాశం ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతలు ధాన్యం దిగుబడిని ప్రభావితం చేయడం ద్వారా ఫినోలాజికల్(జీవ సంబంధమైన) అభివృద్ధి ప్రక్రియలను ప్రభావితం చేస్తాయి. మొక్కజొన్నలో 28 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద కాల్షియం శోషణ తగ్గుతుంది. వరి, గోధుమలు, బార్లీ, జొన్న, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు, నూనె దిగుబడినిచ్చే పంటలు మొదలైన వాటితో సహా అనేక సాగు చేసిన పంటలలో అధికవేడి దిగుబడిని తగ్గించిందని అధ్యయనాలు తెలుపుతున్నాయి. తృణధాన్యాల దిగుబడిని 4.1 శాతం నుండి 10.0 శాతం వరకు తగ్గించిందని నిరూపించారు. వేడి ఒత్తిడిలో బార్లీ ధాన్యం నాణ్యత బాగా తగ్గుతుంది. అధిక వేడి వలన గోధుమలు, మొక్కజొన్న వరి పంటలు కోతకు ముందే ఎండిపోతాయి. పండ్లు, కూరగాయలు ప్రభావితమవుతాయి. తక్కువ రుచి, తక్కువ బరువుతో దిగుబడి వస్తుంది. తట్టుకోగల రకాలతో పోలిస్తే సున్నితమైన పంట రకాలు వేడి ఒత్తిడి వల్ల తీవ్రంగా ప్రభావితమవుతాయి. అధిక ఉష్ణోగ్రత కిరణజన్య సంయోగక్రియ, శ్వాసక్రియకు భంగం కలిగిస్తుంది. పంటల నాణ్యత దిగుబడి తగ్గుదల ఆహార భద్రతకు ప్రమాదాన్ని పెంచుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు పశువులను కూడా విడిచిపెట్టదు. మాంసం, పాల ఉత్పత్తిని తగ్గిస్తుంది. ఆహార కొరతను మరింత పెంచుతుంది. దీని ప్రభావం చాలా భయంకరమైనది. అధిక వేడి ఆహార పోషక నాణ్యతను తగ్గిస్తుంది. చెడిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పేదరికంతో గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారు తరచుగా స్థానిక వ్యవసాయంపై ఆధారపడి జీవనోపాధి కోసం ఎక్కువగా ఆధారపడతారు. పంటలు విఫలమైనప్పుడు లేదా చాలా ఖరీదైనవిగా మారినప్పుడు పెరిగిన ఆహార అభద్రత, పోషకాహార లోపాన్ని ఆకలిని పెంచుతుంది. ఆహారం అధిక ఖర్చులు పరిమిత ఆర్థిక వనరులను దెబ్బతీస్తాయి. ఈ జనాభా ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి ఇతర అవసరాలను పొందడం మరింత కష్టతరం చేస్తుంది. ప్రజలలో అసమానతలకు కారణమవుతుంది.

నష్టాల తగ్గింపు ఎలా?

ఈ సవాళ్ళను ఎదుర్కునేందుకు తక్షణ, దీర్ఘకాలిక వ్యూహాలు అమలుచేయాలి. కరువునిరోధక పంటలను ఎన్నుకోవాలి. సమర్థవంతమైన నీటిపారుదల వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలి. విభిన్న రకాల పంటలపై ఆధారపడటం వలన ఏదైనా ఒక ప్రధానమైన పంట విఫలమైనప్పుడు కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. ఆహార వ్యర్థాలను తగ్గించగలగాలి. ఆహారం చెడిపోకుండా నిరోధించడానికి నిల్వ, రవాణా వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు ఆహార భద్రతకు మద్దతు ఇచ్చే విధానాలను అమలుచేయాలి. ముఖ్యంగా భూతాపం పెరగకుండా చూడాలి. ఇది మన చేతిలోనే ఉంది.

సెల్: 8247045230

దుష్ట 'శక్తుల'తోనే దేశం పోరాడాలి

డాక్టర్ దేవరాజు మహారాజు

"నరేంద్రమోదీకి దమ్ముంటే మణిపూర్ వెళ్లి అక్కడి ప్రజలకు ప్రాణ ప్రతిష్ఠ చేయాలి. అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠకు హాజరుకాని శంకరాచార్యులపై ఈడీతో రైడ్‌లు చేయించాలి. అసలు నరేంద్రమోదీ ఈ దేశ ప్రధానమంత్రా లేక దేశంలోని దేవాలయాలన్నింటికీ ఆయనే ప్రధాన అర్చకుడా? పదేళ్లలో ఒక్కటంటే ఒక్క ప్రెస్‌మీట్ పెట్టని ఆయన, ప్రాంప్టర్స్ లేకుండా మాట్లాడలేని ఆయన, తనకు యాభైఆరు అంగుళాల ఛాతి ఉందని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి కదా? ఈ దేశంలోని దైవ విశ్వాసకులంతా గాంధీ నమ్మిన రాముణ్ణి నమ్ముతున్నారు. మోదీ, షా, యోగి, బీజేపీ, ఆరెస్సెస్‌లు మాత్రం నాథూరామ్ గాడ్సేను నమ్ముతున్నారు-" అని పార్లమెంట్‌లో ప్రకటించాడు- జాన్ బ్రిటస్, కేరళ రాజ్యసభ యం.పీ! అంతేకాదు, ఈ దేశ ద్రోహుల్ని నమ్మగూడదని ఆయన ఈ దేశ ప్రజలకు ఒక హెచ్చరిక కూడా చేశాడు. ఎలక్టోరల్ బాండ్స్ విషయంలో ఏం తేలిందీ? "చందా ఇవ్వు- దందా చేస్కో" అని మోదీ ప్రభుత్వం లెక్కలేని అవినీతికి పాల్పడిందని వెల్లడైంది కదా?

స్వతంత్ర భారతావనిలో ఎన్నడూ ఎరగని విధంగా ఎన్నికల కమీషన్ అధికారులని కొనేసి చండీఘర్ మేయర్ పదవికి గేటు కడదామనుకున్న దుష్ట ప్రణాళిక ఎవరిదీ? మోదీ అండ్ పార్టీదే కదా? పైగా కనీవినీ ఎరగని రామభక్తి. పారవశ్యంలో కళ్లు మూసుకుపోయినట్టు నటించాడు కదా? ఏం నటన అదీ? ఆస్కార్ కూడా తలదించుకునేంత అసహ్యకరమైన కుటిల నటన! మెజార్టీ ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కార్పొరేటర్లను, ఎన్నికల అధికారులను కొని, బీజేపీకి వ్యతిరేకంగా పడిన బాలెట్ పేపర్లపై గీతలు గీయించి, చెల్లనివిగా చేయించి, ఎలాగైనా మేయర్ పదవి దక్కించుకోవాలని ప్రయత్నించి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందు అడ్డంగా దొరికిపోయిన మోదీ సత్య నిష్ఠాగరిష్టుడా? ఇలాంటి వాడు గనకనే పీఠాధిపతులంతా అయోధ్య రాముడికి ఈయన ప్రాణ ప్రతిష్ఠ చెయ్యొద్దని గగ్గోలు పెట్టారు. ఈరోజు ఏమైందీ? రామ భక్తులంతా తల దించుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. రామభక్తులు మోదీ భక్తులు నిజాలు గ్రహించాల్సిన అవసరం వచ్చింది. మోదీ ఒక దేవుడి అవతారంగా భావించే అంధ విశ్వాసకుల కళ్లు ఇకనైనా తెరుచుకోవాలి. ఎందుకంటే, ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రధాని మోదీకి ఊపిరి ఆడనివ్వడం లేదు. అందుకే శ్రీకృష్ణ కుచేలుల కథ ముందుకు తెచ్చి- అదే ఈ కాలంలోనైతే కుచేలుడు శ్రీకృష్ణుడు ఇద్దరూ అవినీతిపరులయ్యేవారు"- అని తన అక్కసు వెళ్లగక్కుకున్నాడు. నిజానికి తన అవినీతి, తన పార్టీ అవినీతి బయటపడిందని ఆయన తన ఉక్రోషం వెళ్లగక్కుకున్నాడని- ఈ దేశ ప్రజలకు అర్థమయ్యింది!

నేలను దున్ని ఈ దేశానికి అన్నం పెడుతున్న రైతులు ప్రధాని మోదీ

ఇంటికీ, ఆఫీసుకీ కూతవేటు దూరంలో దిల్లీ సరిహద్దుల్లో ధర్నా చేస్తుంటే పోయి, మాట్లాడి సమస్య పరిష్కరించడానికి తీరికలేదు- చిత్తశుద్ధి లేదు. వారి మీద డ్రోన్‌లు ఉపయోగించి, బాష్ప వాయువు ప్రయోగించమంటాడు. వారిపై బుల్లెట్ల వర్షం కురిపించమంటాడు. రోడ్డు మీద మేకులు కొట్టిస్తాడు. అవన్నీ దాటుకుని వస్తారేమోనన్న భయంతో రోడ్లు వేయించి, గోతులు తవ్విస్తాడు. ఇన్ని చేసినవాడు పారిపోయి సముద్రంలో దాక్కుంటాడు. అదేమంటే ద్వారక భూమికి పూజ చేస్తున్నానని ఫొటోషూట్ చేయించుకుంటాడు. అసలు ఫొటోషూట్ ఎప్పుడు చేయించుకోలేదూ? ఎక్కడ చేయించుకోలేదూ? బతుకే విచిత్ర వేషధారణ అయినట్లు ఫొటోషూట్ చేయించుకునే వ్యక్తికి ఇక పరిపాలనకు తీరిక ఎక్కడా? తన తల్లి దగ్గరికి వెళ్లినా యాభైమంది కెమెరామెన్‌లతో వెళ్లిన గొప్ప పుత్రరత్నం ప్రపంచమంతా వెతికినా మరొకరు దొరకరు కదా? ఇప్పటికైనా ఈ దేశ ప్రజలు నిజాలు గ్రహించి ఈ అబద్ధపు రాజును ఓ మూల కూర్చోబెడితేగాని ఈ దేశం బాగుపడదు. సముద్రంలో రెడ్ కార్పెట్ మీద కూర్చుని ఫోజులిచ్చాడంటే- ఈ దేశ ప్రజలు ఏమని ఆలోచించాలి? అతణ్ణి శాశ్వతంగా అందులోనే కలిపేయాలని నిర్ణయించుకోవాలి కదా? అతడి ఉత్తుత్తి యాక్షన్లను జనం నిజంచేసి చూపించాలి కదా? కన్నతల్లిని, కట్టుకున్న భార్యను దూరంపెట్టి ఈ దేశ ప్రజలు సొమ్ముతో విదేశాల్లో బలాదురు తిరిగేవాడు- ఈ దేశ ప్రజల బతుకులు ఉద్ధరిస్తాడని ఎలా నమ్ముదాం? కట్టుకున్న భార్యకు విడాకులివ్వకుండా వదిలేసిన ఈ అనైతిక జీవి- అబద్ధాల బ్రాండ్ ఎంబాసిడర్ "ఈ దేశ ప్రజలే నాకుటుంబం!" అని అంటే ప్రజలు నమ్ముతారా? పదేళ్లుగా చూస్తున్నాం కదా? కోట్ల విలువగల సూట్లు వేసుకుని తిరగడం, కోట్లు విలువచేసే తిండితినడం కోట్లు ఖర్చుచేసి దేశదేశాలు తిరిగి రావడం- సరేకాని దేశానికి ఆవగింజంత మేలు జరిగిందా? లేదు కదా? ఎంత ఖరీదైన దుస్తులు వేసుకున్నా, ఎంత మేకప్ చేసుకున్నా- దేశాన్ని మరింత పేదరికంలోకి నెట్టిన ప్రేతకళ ఆయన ముఖంలోనూ ఆయన టీం సభ్యుల ముఖాల్లోనూ తాండవమాడుతూనే ఉంది కదా? "ప్రతి తల్లీ ప్రతి కూతురూ నాకు శక్తి స్వరూపిణియే. నాకు తల్లులూ, చెల్లెళ్లూ అందరూ శక్తి స్వరూపిణులే. నేను భారతమాత, పూజారిని"- అని గొంతు చించుకుని చెప్పుకున్న భారత ప్రధాని నరేంద్రమోదీ - మరి, ఈ కింది సమస్యలు ఎదురైనప్పుడు ఎందుకు నోరు కుట్టేసుకున్నారు? ఏ శక్తి ఆయనని ఆపిందీ?

1. మహిళా మల్ల యోధులు తమపై బీజేపీ ఎంపీ లైంగికదాడులు చేశారని ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ, దిల్లీలో ఆయన ఇంటి ముందే నిరసనదీక్షలు చేస్తున్నవారిపై పోలీసులు దాడిచేస్తే మౌనం పాటించారు. - ప్రపంచ మీడియా ఈ దేశ ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా కడిగేసింది కదా?

2. కతువా, ఉన్నావ్, హత్రాస్‌లలో శారీరక దోపిళ్లకు గురైన మహిళలంతా శక్తి స్వరూపిణులు కారా? వారు తల్లులూ, అక్కాచెల్లెళ్లూ, కూతుర్లూ కారా?

3. కాన్పూర్‌లో ఇద్దరు మైనర్ బాలికలు ఉరేసుకుంటే- ఈ శక్తి పూజారికి ఈ భరతమాత పూజారికి- ఒక్క చీమైనా కుట్టలేదా? అవసరమైనప్పుడు చెవిటివాడిగా, తప్పనిసరైనప్పుడు గుడ్డివాడుగా ఉండడం ఆయన నటనా కౌశల పాండిత్య ప్రదర్శనలో భాగమేనా?

4. మణిపూర్‌లో మహిళలను రేప్ చేసి, నగ్నంగా ఊరేగించినప్పుడు ఆయనలోని పూజారి ఏమయ్యాడు? భరతమాతనే నగ్నంగా ఊరేగించినట్టుగా ఉందని అవమాన భారంతో దేశ ప్రజలు అట్టుడికిపోయారే- అప్పుడు కూడా ప్రపంచ మీడియా కన్నెర్ర చేసిందే? మరి అప్పుడు ఈయన కేమయ్యిందీ? ఈయన పూజారితనానికేమయ్యింది? ఈయన అంటున్న ఆ శక్తిని వెనక ఉండి అంత హీనంగా చేయించింది ఈయనే కదా? కనీసం నోరు విప్పలేదు. క్షమాపణ కోరలేదు. వెళ్లి కనీసం ఈనాటికీ సానుభూతి చూపలేదు కదా?

నోరు ఎవరు కుట్టేశారూ? అనవసరమైన వాటి మీద గొంతు చించుకునే ఈ నాటకాల రాయుడు స్పందించలేదెందుకూ? ఇలాంటి ఎన్నెన్నో సందర్భాలలో భారత ప్రధాని నోరు ఎందుకు మెదపలేదో, ఎందుకు కాలు కదిపి అక్కడికి వెళ్లలేకపోయాడో- 'నేషన్ వాంట్స్ టు నో'- అండీ! తమాషా కన్నా ఊరికే మాటలు చెప్పడం కాదు. "ఆధ్యాత్మికత- అనేది మనిషిని అజ్ఞానిగా, ఆలోచనాహీనుడిగా, పరాధీనుడిగా, బానిసగా , ప్రశ్నించలేని వాడిగా నిష్క్రియాశీలుడిగా-తయారుచేసే ఒక ప్రక్రియ!"- అన్నది ఈ దేశంలోని యువతీ యువకులు గ్రహిస్తున్నారు. ఇప్పుడిక రామాలయాలు, పూజారి వేషాలూ పనిచేయవు. రాముణ్ణి నమ్మే జనంఉన్నా, నాథూరామ్‌ను నమ్మే ప్రజలు లేరు. ఆ పని బీజేపీ, ఆరెస్సెస్‌లు చేసుకోవాల్సిందే!

ఒక ఏనుగూ, మురికి గుంటలోంచి లేచి వచ్చిన పందీ- రెండూ ఒక చిన్న వంతెన మీద ఎదురుపడ్డాయి. ఏనుగు పక్కకు తొలగి పందికి దారి ఇచ్చింది. అంతే తనకు ఏనుగు భయపడుతోందని పంది ప్రచారం మొదలుపెట్టింది. "అలా ఎందుకు చేశావని" కొన్ని జంతువులు ఏనుగును అడిగాయి. "నిజమే! ఒక్క తొక్కు తొక్కితే పంది ఛస్తుంది. కాని, దాని మీద ఉన్న బురద నా మీద పడుతుంది. ఆ బురద కడుక్కోవడం మళ్లీ నాకొక పెద్ద పని. అందుకని అలా చేశానని" చెప్పింది ఏనుగు. తన విలువ, తన స్థాయీ ఏమిటో తెలుసుకోకుండా దుష్ప్రచారానికి దిగింది వరాహావతారం! సమాజంలో కొందరు మనుషులు, కొన్ని రాజకీయ పార్టీలు కూడా అంతే!! వారి స్థాయి ఏమిటో వారు గ్రహించుకోరు. ఎదుటివారి సామర్థ్యాన్ని కూడా అన్వయించుకోవచ్చు. సహనం, సంయమనం పాటిస్తున్న ఈ దేశ ప్రజలు ఏనుగులాంటి వారే. వారి మంచితనాన్ని ఆసరా చేసుకుని ఎగిరెగిరిపడే వరాహమూర్తులే మన ప్రస్తుత బీజేపీ నాయకులు. ప్రజా ఏనుగు ఇప్పుడు బురద కడుక్కుందామని అనుకుంటోంది, అందుకే తొక్కెయ్యడానికి సిద్ధంగా ఉంది!

కేంద్ర సాహిత్య అకాడెమీ విజేత, జీవ శాస్త్రవేత్త
మెల్‌బోర్న్ నుంచి

'ఇండియా'దే తదుపరి ప్రభుత్వం

అధికార ఎన్‌డీఏ నిష్క్రమించబోతోంది

ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్

పాట్నా : తమ పార్టీ భాగమైన ఇండియా కూటమి కేంద్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ నిష్క్రమించబోతోందని ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ శనివారం నొక్కి చెప్పారు. రాష్ట్రంలో ప్రతిపక్ష సంకీర్ణానికి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి నాయకత్వం వహించిన బీహార్ మాజీ డిప్యూటీ సీఎం, ఓటు వేసిన తర్వాత ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 'జూన్ 4న ఫలితాలు వెలువడిన తర్వాత 'ఇండియా' సంకీర్ణం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ఎన్‌డీఏ నిష్క్రమించబోతోంది' అని 34 ఏళ్ల నాయకుడు తెలిపారు. ఎగ్జిట్ పోల్స్‌పై కాంగ్రెస్ సందేహాన్ని మిత్రపక్షమైన ఆర్‌జేడీ పంచుకున్నట్లు కనిపించింది. ఎన్నికల అనంతరం సర్వేలపై టీవీ చర్చల్లో పాల్గొనకూడదని ఆర్‌జేడీ తీసుకున్న నిర్ణయం గురించి అడిగినప్పుడు, 'ఈ ఎగ్జిట్ పోల్‌లను నిర్వహిస్తున్న వ్యక్తులు ఎవరు? వీటిలో దేనిని మనం సీరియస్‌గా తీసుకోవాలి? వాస్తవం ఏమిటంటే, మేము క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉన్నాము. ప్రజల మానసిక స్థితి గురించి మాకు ప్రత్యక్ష అవగాహన ఉంది' అని తేజస్వి నొక్కి చెప్పారు. సంకీర్ణానికి మెజారిటీ తక్కువ వచ్చినప్పుడు మిత్రపక్షాలు విడిపోకుండా నిరోధించే లక్ష్యంతో ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశం ఏర్పాటు చేశారన్న వాదనలను ఆర్‌జేడీ నాయకుడు తోసిపుచ్చారు. 'నేను సమావేశంలో ఉంటాను. అజెండాలో ఏమి ఉందో మేము మీ అందరికీ తెలియజేస్తాము' అని పేర్కొన్నారు. కన్యాకుమారిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధ్యానం గురించి వ్యాఖ్యానించవలసిందిగా కోరినప్పుడు, 'అది 'ఒక ఫోటో ప్రచార యావ'. రాజ్యాంగాన్ని రక్షించడానికి, నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రభుత్వాన్ని శిక్షించడానికి ఓటు వేసిన ప్రజలలో ఆ అంశం లేదు' అని తెలిపారు. తరువాత భార్య, చిన్న కుమార్తెతో కలిసి విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

ముంబైలో అత్యవసర ల్యాండింగ్

ముంబై: చెన్నై నుంచి ముంబై బయల్దేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు కలకలం రేపింది. దీంతో వెంటనే విమానాన్ని ముంబైలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. వారం రోజుల వ్యవధిలో ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం ఇది రెండోసారి. అధికారుల వివరాల ప్రకారం... శనివారం ఉదయం 6.50 గంటలకు 172 మంది ప్రయాణికులు, సిబ్బందితో చెన్నై నుంచి ఇండిగో విమానం ముంబైకి బయల్దేరింది. కొద్దిసేపటికి విమానంలో బాంబు ఉందనే బెదిరింపు కాల్స్ వచ్చాయి. విమానంలో ఓ రిమోట్ సైతం లభ్యమైంది. వెంటనే స్పందించిన పైలట్లు ముంబై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు సమాచారం అందించి అత్యవసర ల్యాండింగ్ కోసం అభ్యర్థించారు. విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యే సమయానికి ముంబై విమానాశ్రయ అధికారులు ఫైర్ టెండర్లు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. ప్రయాణికులను క్షేమంగా దించేశారు. అనంతరం రంగంలోకి దిగిన బాంబు స్క్వాడ్ సిబ్బంది విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. విమాన్ని టెర్మినల్ ప్రాంతంలో ఉంచినట్లుగా అధికారులు తెలిపారు. ఇదే విధంగా గత వారం ఢిల్లీ నుంచి వారణాసికి వెళ్లనున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. విమానం టేకాఫ్ కాకముందే బెదిరింపు రావడంతో అప్రమత్తమైన అధికారులు విమానం ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ల ద్వారా ఢిల్లీ విమానాశ్రయంలో ప్రయాణికులను దించారు.

తొలిసారి ఓటేసిన 92 ఏళ్ల వృద్ధుడు

రాంచీ: జీవితంలో తొలిసారి ఓటుహక్కును వినియోగించుకున్నాడు ఓ వృద్ధుడు. తనకు 92 ఏళ్లు వచ్చేవరకు అసలు పోలింగ్ కేంద్రం వైపు చూడలేదు. ఝార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్‌కు చెందిన ఖలీల్ అన్సారీ దృష్టి లోపంతో బాధపడుతున్నాడు. రాజ్‌మహల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధి మండ్రోలోని పదో నంబరు పోలింగ్ కేంద్రంలో శనివారం ఓటు వేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మండ్రో పోలింగ్ కేంద్రాల్లో రాష్ట్ర ఎన్నికల అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఖలీల్ అన్సారీ తనకు ఓటు లేదని, ఇప్పటివరకు అసలు ఓటే వేయలేదని తెలిపారు. దీంతో వెంటనే ఆయన పేరును ఓటరు జాబితాలో చేర్చాలని ఝార్ఖండ్ ఎన్నికల ముఖ్య అధికారి (సీఈవో) రవికుమార్ ఆదేశించారు. ఈ క్రమంలోనే జిల్లా అధికారులు అన్సారీ వివరాలు నమోదు చేసుకున్నారు. 'మొట్టమొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని ఓటేసిన అనంతరం అన్సారీ తెలిపారు. ఇదిలాఉండగా, ఝార్ఖండ్‌లో మొత్తం 14 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. చివరిదశలో భాగంగా మూడు పార్లమెంటు నియోజకవర్గాల్లో (దుమ్కా, రాజ్‌మహల్, గొడ్డా) పోలింగ్ కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూడుచోట్ల కలిపి 46.80 శాతం ఓటింగ్ నమోదైంది.

కేరళలో భారీ వర్షాలు

- విరిగిపడుతున్న కొండచరియలు
- అనేక ప్రాంతాలు జలమయం
- పర్వత ప్రాంత జిల్లాల్లో విధ్వంసం
- రెడ్ అలర్ట్ ప్రకటించిన ఐఎండీ

తిరువనంతపురం : నైరుతి రుతుపవనాలు ప్రారంభమైన రెండు రోజుల తర్వాత కేరళలో అవి మరింత విస్తరించటంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ, మధ్య జిల్లాల్లో కొండచరియలు విరిగిపడటం, చెట్లు నేలకూలడం, భారీగా వర్షం నీరు నిలిచిపోవడం జరిగింది. గంటల తరబడి కురుస్తున్న వర్షాలకు కొట్టాయం, ఇడుక్కి జిల్లాల్లోని కొండ ప్రాంతాల్లో తీవ్ర విధ్వంసం ఏర్పడగా, త్రిసూర్ జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తన వాతావరణ హెచ్చరికను నవీకరించింది. మధ్య జిల్లా త్రిసూర్, ఉత్తర జిల్లాలయిన మలప్పురం, కోజికోడ్‌ను శనివారం రెడ్ అలర్ట్‌లో ఉంచింది. ఇడుక్కి, పాలక్కాడ్, వయనాడ్‌లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించగా, ఆరు జిల్లాల్లో ఎల్లో అలర్ట్ ప్రకటించారు. రెడ్ అలర్ట్ 24 గంటల్లో 20 సెం.మీ కంటే ఎక్కువ భారీ నుంచి అతి భారీ వర్షాన్ని సూచిస్తుంది. అయితే ఆరెంజ్ అలర్ట్ అంటే 11 సెం.మీ నుంచి 20 సెం.మీ వరకు అతి భారీ వర్షాన్ని సూచిస్తుంది. ఎల్లో అలర్ట్ అంటే 6 సెం.మీ, 11 సెం.మీ మధ్య భారీ వర్షపాతాన్ని సూచిస్తుంది. పర్వత ప్రాంత జిల్లా ఇడుక్కి అంతర్భాగంగా ఉన్న పూచాప్రా, కొలప్ర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి కొండచరియలు విరిగిపడటంతో పాటు చెట్లు నేలకొరిగాయి. కొండచరియలు విరిగిపడడంతో కొన్ని ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయని, అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. కొండపై నుంచి భారీ గ్రానైట్ బండరాళ్లు పడిపోయి పంటలు ధ్వంసమయ్యాయి. అలాగే, స్థానికులు వినియోగించుకునే అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. 'మేము ఇటువంటి ఘోరాన్ని ఎదుర్కొన్నాం. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. గ్రానైట్ బండరాళ్లు, భారీ రాళ్లు, ఇసుక కిందకు జారాయి. చెట్లు ఎగిరి కిందకు వస్తున్నట్లు మాకు అనిపించింది' అని ఒక గ్రామస్తుడు తన భయానక అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు. కొండ ప్రాంతంలో నివాసముంటున్న ఓ కుటుంబం ఇంటిపై రాళ్లు పడడంతో తృటిలో తప్పించుకున్నారు. అనంతరం వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. బురదజల్లే ప్రమాదం ఉన్నందున తొడుపుజా-పులియన్మల రాష్ట్ర రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇడుక్కిలోని మలంకర డ్యామ్ ఐదు షట్టర్లను తెరవడంతో జిల్లా అధికారులు తొడుపుజా, మువత్తుపుజా నదుల ఒడ్డున నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొరుగున ఉన్న కొట్టాయం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో మీనాచల్, మణిమాల నదుల సమీపంలో నివసించే ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. కొట్టాయంలోని అనేక ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి గంటల తరబడి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులు జలమయం కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం రాత్రి వడవత్తూరు ప్రాంతంలో 100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కొట్టాయం పట్టణ ప్రాంతాల్లో 99 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు. ఓడరేవు నగరం కొచ్చిలో మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ, ఎర్నాకులంలోని అలువా ప్రాంతంలో మే 31 రాత్రి నుంచి తీవ్రమైన వర్షాలు కురుస్తున్నాయి. మధ్య జిల్లా త్రిసూర్‌లో శనివారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తోంది. ప్రజలు పెద్ద సంఖ్యలో బస్టాప్‌లు, రైల్వే స్టేషన్లలో చిక్కుకున్నారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. తాజా రాడార్ చిత్రాల ప్రకారం, త్రిస్సూర్‌లో గంటకు 40 కి.మీ వేగంతో గాలులు వీయడంతో పాటు ఒక మోస్తరు ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలపింది.

ప్రధాన రహదారులు జలమయం కావడం, వాహనాలు సరిగా కనిపించకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాలు, నదీ తీరాల్లోని అనేక ప్రాంతాల్లో వర్షం నీరు పొంగిపొర్లుతుందని హెచ్చరించారు. ప్రజలు సురక్షితమైన ప్రదేశాలలో ఉండాలని వారు కోరారు. నైరుతి రుతుపవనాలు కేరళ, ఈశాన్య ప్రాంతంలో మే 30న ప్రవేశించాయి.

115 ఎమ్మెల్యే, 15 ఎంపీ సీట్లు మావే

బీజేడీ నేత వి.కె.పాండియన్

భువనేశ్వర్ : ఒడిశాలోని 147 అసెంబ్లీ స్థానాల్లో 115కి పైగా అధికార పార్టీ గెలుస్తుందని, రాష్ట్రంలోని 21 లోక్‌సభ నియోజకవర్గాల్లో 15 స్థానాలు కైవసం చేసుకుంటాయని బీజేడీ సీనియర్ నేత వీకే పాండియన్ శనివారం ప్రకటించారు. రాష్ట్రంలో నాలుగో, చివరి విడత ఎన్నికలు జరుగుతున్న రోజున ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పాండియన్ మాట్లాడుతూ 'మూడవ దశ పోలింగ్ తర్వాత ఈ రోజు జరిగిన నాల్గవ విడత పోలింగ్‌లో బీజేడీ 85 అసెంబ్లీ స్థానాలను గెలుస్తోంది. మొత్తం 147 సీట్లలో 115 కంటే ఎక్కువ సీట్లు, 21 లోక్‌సభ స్థానాల్లో 15 స్థానాలను గెలుచుకుంటుంది' అని పేర్కొన్నారు. మూడు వంతుల మెజారిటీతో పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. బీజేడీ 2019లో రాష్ట్రంలో 113 అసెంబ్లీ స్థానాలు, 12 లోక్‌సభ నియోజకవర్గాలను గెలుచుకుంది. 'మమ్మల్ని ఆశీర్వదించినందుకు ఒడిశా ప్రజలకు మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఒడిశాకు బలమైన, పరివర్తనాత్మక పాలన అందించడానికి మేము కట్టుబడి ఉన్నాం' అని బీజేడీ ప్రతినిధి సస్మిత్ పాత్ర అన్నారు. అంతకుముందు, ప్రతిపక్ష బీజేపీ ఒడిశాలో 16 లోక్‌సభ స్థానాలకు పైగా గెలుపొందడంతో పాటు 75 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుని రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. జూన్ 10న రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలని ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ ఒడిశా ప్రజలను కోరారు. మరోవైపు, బీజేడీ ఆరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ జూన్ 9న ప్రమాణ స్వీకారం చేస్తారని పేర్కొంది.

ముగిసిన మోదీ ధ్యానం



చెన్నై: తమిళనాడులోని కన్యాకుమారిలో స్వామి వివేకానంద శిలాస్మారకం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన సుదీర్ఘ ధ్యానం శనివారం ముగిసింది. గురువారం సాయంత్రం 6.45 గంటలకు ప్రారంభమైన ధ్యానం 45 గంటలపాటు కొనసాగింది. ఈ క్రమంలోనే ఉదయం సూర్యుడికి అర్ఘ్యం వదిలారు. ధ్యానం ముగిసిన అనంతరం ప్రముఖ తమిళ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ విగ్రహానికి మోదీ పూలమాల వేసి నివాళులర్పించారు. వివేకానంద శిలాస్మారకం పక్కనే చిన్న దీవిపై ఏర్పాటు చేసిన 133 అడుగుల ఎత్తయిన ఈ భారీ విగ్రహం వద్దకు ఆయన పడవలో చేరుకున్నారు. అనంతరం కన్యాకుమారి తీరానికి తిరిగివచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార గడువు ముగిసిన వెంటనే పంజాబ్ నుంచి వెనుదిరిగిన మోదీ... తమిళనాడులోని భగవతి అమ్మన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం శిలాస్మారకాన్ని చేరుకుని గురువారం సాయంత్రం మోదీ ధ్యానం ప్రారంభించారు. ఈ సమయంలో ఆయన కేవలం ద్రవాహారం... అంటే కొబ్బరి నీళ్లు, ద్రాక్షరసం మాత్రమే స్వీకరిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మౌనంగా ఉంటారని, మెడిటేషన్ హాల్ నుంచి బయటకు రారని తెలిపాయి. 131 ఏళ్ల క్రితం స్వామి వివేకానంద కూడా ఇక్కడ ధ్యానం చేశారు. 2019లో ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయన కేదార్‌నాథ్ వద్ద గుహల్లో ధ్యానం చేసిన విషయం తెలిసిందే.

బెంగాల్‌లో ఎన్నికల హింస

ఈవీఎంలను చెరువులోకి విసిరి... బాంబులతో దాడి

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల చివరి దశ పోలింగ్‌లో భాగంగా దేశంలోని పలు రాష్ట్రాలో శనివారం పోలింగ్ జరిగింది. బెంగాల్ జయనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఓ అల్లరిమూక పోలింగ్ స్టేషన్‌లోకి చొరబడి, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాన్ని చెరువులో విసిరేశారు. ఈ ఘటనతో ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. పోలీసుల వివరాల ప్రకారం... కుల్తాలీ గ్రామంలో పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో స్థానికులకు, పోలింగ్ ఏజెంట్లకు మధ్య వివాదం చెలరేగింది. బేనిమాధవ్‌పూర్ ఎఫ్‌పి స్కూల్ బూత్‌లోకి ఏజెంట్లను రానీయకుండా కొంతమంది అడ్డుకోవడంతో కలకలం రేగింది. వీరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన స్థానికులు బలవంతంగా పోలింగ్ స్టేషన్‌లోకి ప్రవేశించారు. ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయలతో కూడిన ఈవీఎంను బయటకు తీసుకెళ్లి చెరువులో పడేశారు. ఘటనపై సెక్టార్ ఆఫీసర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. 'సెక్టార్ పరిధిలోని మొత్తం ఆరు బూత్‌లలో పోలింగ్ ప్రక్రియకు అంతరాయం లేకుండా సాగింది. ఈవీఎంను చెరువులో పడేసిన చోట కొత్త ఈవీఎం, పేపర్లను సెక్టార్ అధికారికి అందించాం' అని పశ్చిమ బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ తెలిపారు.

మరో ఘటనలో కోల్‌కతాలోని జాదవ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని భాంగర్‌లోని సతులియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్, సీపీఐ(ఎం) కార్యకర్తల మధ్య వివాదం చోటు చేసుకుంది. అనంతరం ఇరువర్గాలు పరస్పరం బాంబులతో దాడులకు దిగారు. ఈ ఘర్షణలో పలువురు ఐఎస్ఎఫ్ సభ్యులు గాయపడ్డారు. బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల ఏడో దశ పోలింగ్ ప్రక్రియ ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైంది. డమ్ డమ్, బరాసత్, బసిరాత్, జయనగర్, మధురాపూర్, డైమండ్ హార్బర్, జాదవ్‌పూర్, కోల్‌కతా దక్షిణ్, కోల్‌కతా ఉత్తర స్థానాల్లో సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

పుణె కారు ప్రమాద ఘటనలో బాలుడి తల్లి అరెస్టు

పుణె: మహారాష్ట్రలోని పుణెలో ఓ టీనేజర్ ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ఇద్దరు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. తమ కుమారుడిని తప్పించేందుకు అతడి కుటుంబం కొందరు అధికారులతో కలిసి చేసిన యత్నాలు విస్తుగొలుపుతున్నాయి. అలాగే బ్లడ్ టెస్ట్ సమయంలో నిందితుడి రక్త నమూనాలు బదులుగా తనవి ఇచ్చిన తల్లిని తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. ప్రమాదం సమయంలో ఆ మైనర్ తాగలేదని నిరూపించేందుకు ఆమె రక్తనమూనాలు ఇచ్చినట్లు శనివారం పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన రోజు ఫోరెన్సిక్ విభాగం అధిపతి డాక్టర్ తావ్డే, నిందితుడి తండ్రి ఫోన్‌లో మాట్లాడుకున్నారని పలు కథనాలు వెల్లడించాయి. ఆ సందర్భంగా నిందితుడి రక్త నమూనాలను మార్చేస్తే భారీ మొత్తం ఇచ్చేలా డీల్ కుదిరిందని పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే టీనేజర్ తల్లి శాంపిళ్లను బ్లడ్ టెస్ట్‌కు ఇచ్చినట్లు దర్యాప్తులో తేలింది. రక్త నమూనాలు ఇచ్చిన తర్వాత ఆమె ఆచూకీ లేకుండా పోయారు. అలాగే కొద్దిరోజుల క్రితం ఒక వీడియో సందేశం విడుదల చేసిన ఆమె... తన కుమారుడిని రక్షించాలంటూ కన్నీరుపెట్టుకున్నారు. సాక్ష్యాలను తారుమారు చేసినందుకు, శాంపిల్స్‌ను మార్చిన ఆరోపణలపై ఆమెను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కోర్టుముందు శనివారం ప్రవేశపెడతామన్నారు. ఇప్పటికే నిందితుడి తండ్రి, తాత కూడా అరెస్టయిన సంగతి తెలిసిందే. ఈ కేసును తనపై వేసుకోమని తమ డ్రైవర్‌ను ఒప్పించేందుకు యత్నించారని, అతడు అంగీకరించకపోవడంతో కిడ్నాప్ చేసి ఒత్తిడి తీసుకొచ్చారన్న ఆరోపణలు వారిద్దరి అరెస్టుకు కారణమయ్యాయి. నేరాన్ని కప్పిపుచ్చేందుకు ఆ కుటుంబం పలువురు అధికారులను ప్రలోభపెట్టేందుకు యత్నించిందని దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇక నిందితుడి శాంపిళ్లు మార్చిన వైద్యుడిపై వేటు పడిన సంగతి విదితమే. డాక్టర్ శ్రీహరి హల్నోర్‌ను సాసూన్ జనరల్ ఆస్పత్రి నుంచి తొలగించారు. అతడిని సర్వీసు నుంచి పూర్తిగా డిస్మిస్ చేసినట్లు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్ మహారాష్ట్ర ప్రకటించింది. దీంతోపాటు ఈ కేసులో ఉన్న ఫోరెన్సిక్ విభాగం అధిపతి డాక్టర్ తావ్‌డేపైనా సస్పెన్షన్ వేటు వేసింది. వీరితో పాటు గుమస్తాను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

ప్రజ్వల్ రేవణ్ణ తల్లి పరారీ

బెంగళూరు: దేశవ్యాప్తంగా కలకలం రేపిన హాసన్ అశ్లీల వీడియో, కిడ్నాప్ కేసుల్లో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. మహిళలపై లైంగిక దౌర్జన్యం, బ్లాక్‌మెయిల్ ఆరోపణలతో హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో ప్రజ్వల్ తల్లి భవానీ రేవణ్ణపైనా ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారించేందుకు పోలీసులు ఇంటికి వెళ్లగా ఆమె అందుబాటులో లేరు. ప్రస్తుతం ఆమె పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. రేవణ్ణ ఇంటి పనిమనిషి కిడ్నాప్ ఘటనలో భర్త రేవణ్ణతో పాటు భవానీకి కూడా సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆమెను విచారించేందుకు సిట్ అధికారులు ఆమెకు నోటీసులు పంపారు. శనివారం ఇంటికి వచ్చి ప్రశ్నిస్తామని అందులో పేర్కొన్నారు. ఆమెను అరెస్టు చేసే అవకాశం ఉందని ఊహాగానాలతో ఉదయం సిట్ అధికారులు హొళెనరసీపురలోని ఆమె నివాసానికి వెళ్లగా భవానీ అక్కడ కనిపించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో ఆమె ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం దాన్ని తిరస్కరించింది.

పరువు నష్టం కేసులో సిద్ధరామయ్య, డీకేకు బెయిల్

బెంగళూరు: పరువు నష్టం కేసులో కర్నాటక సీఎం సిద్ధరామయ్యకు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ఊరట లభించింది. బీజేపీ ప్రధాన కార్యదర్శి కేశవ ప్రసాద్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కోర్టు వీరిద్దరికీ శనివారం బెయిల్ మంజూరు చేసింది. గత బీజేపీ ప్రభుత్వం అన్ని పనుల్లో 40 శాతం కమీషన్ వసూలు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం పేపర్‌లలో ప్రకటనలు ఇచ్చింది. వివిధ పనుల కోసం బీజేపీ సర్కార్ అవినీతి రేటు కార్డులు నిర్ణయించిందంటూ ఆరోపిస్తూ పోస్టర్లు కూడా ముద్రించింది. ఈ పోస్టర్లు, ప్రకటనలపై బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. అప్పటి ముఖ్యమంత్రి బసవరాజ్‌బొమ్మై సహా తమ పార్టీ నేతలపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు సిద్ధరామయ్య, శివకుమార్‌తోపాటు రాహుల్‌గాంధీపై బీజేపీ ఎమ్మెల్సీ, ప్రధాన కార్యదర్శి కేశవ్ ప్రసాద్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. కేసు విచారణ సందర్భంగా సిద్ధరామయ్య, శివకుమార్ 42వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యారు. కోర్టు వీరిద్దరికీ బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది.

మండుతున్న ఎండలు...25 మంది పోలింగ్ అధికారుల మృతి

న్యూఢిల్లీ: తూర్పు భారత దేశంలో ఎండలు నిప్పుల వర్షాన్ని తలపిస్తున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీ యూపీ, హర్యానా వంటి రాష్ట్రాలో ఎండలు మండిపోతున్నాయి. గత నాలుగు రోజులుగా 50 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీంతో బీహార్‌లో గత 48 గంటల్లో వేడిగాలుల కారణంగా కనీసం ఎనిమిది మంది ఎన్నికల అధికారులు మరణించారు. జూన్ 1న జరిగే ఏడో దశ లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో మరో 10 మంది మరణించారని అధికారులు తెలిపారు. 18 మందిలో 11 మంది రోహతాస్ జిల్లాలో, ఆరుగురు భోజ్‌పూర్‌లో, ఒకరు బక్సర్‌లో ఎండల కారణంగా చనిపోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశాలో 10 మంది, బీహార్‌లో 8, జార్ఖండ్‌లో నలుగురు, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు, రాజస్థాన్‌లో ఐదుగురు చనిపోయారు. రానున్న వారం రోజుల పాటు ఢిల్లీ, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, ఒడిశా, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో వేడిగాలులు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

ఆరోపణలు నిరాధారం

కారు ప్రమాదం కేసుపై అజిత్ పవార్ వివరణ

ముంబై: పుణె కారు ప్రమాదం కేసులో తనపై స్థానిక ఎన్సీపీ ఎమ్మెల్యే సునీల్ టింగ్రే చేస్తున్న ఆరోపణలను మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ తోసిపుచ్చారు. ఈ కారు ప్రమాదం కేసులో నిందితుడికి అనుకూలంగా వ్యవహరించాలంటూ పుణే పోలీసులను తాను ఆదేశించినట్లు సునీల్ టింగ్రే చేసిన ఆరోపణలపై శనివారం ముంబైలో అజిత్ పవార్ స్పందించారు. ఈ కారు ప్రమాదం సునీల్ టింగ్రే అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చోటుచేసుకుందని ఆయన గుర్తు చేశారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఆయన సందర్శించారని తెలిపారు. ఈ కేసును ఎమ్మెల్యే సునీల్ టింగ్రే తొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అజిత్ పవార్ ఎదురుదాడికి దిగారు. తనపై ఆయన అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రమాదం అనంతరం ఈ కేసు విషయంలో పుణే పోలీస్ కమిషనర్ అమితేశ్ కుమార్‌కు తాను ఫోన్ చేసినట్లు ఎమ్మెల్యే సునీల్ చేసిన ఆరోపణలపైనా అజిత్ స్పందించారు. పుణే పోలీస్ కమిషనర్‌కు వివిధ అంశాలపై తాను ఫోన్ కాల్ చేస్తానని, కానీ ఈ కారు ప్రమాదం కేసుపై ఆయనతో మాట్లాడలేదని ఆయన స్పష్టం చేశారు. కారు ప్రమాదం అనంతరం పుణె పోలీస్ కమిషనర్‌కు సునీల్ టింగ్రే ఫోన్ చేసి ఉంటారని పవార్ చెప్పారు. ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హోం శాఖను పర్యవేక్షిస్తున్నారని, ఈ కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరపాలని ఆయన ఆదేశించారని గుర్తు చేశారు. కేసు దర్యాప్తులో సీఎం ఏక్‌నాథ్ షిండే సైతం కీలకమైన సూచనలు చేశారని అజిత్ పవార్ తెలిపారు. కేసు విషయంలో పోలీసులు ఆలస్యంగా స్పందించారని, ఆ క్రమంలో వారిపై చర్యలు తీసుకున్నారన్నారు. కేసుకు సంబంధించి రక్త నమూనాలు సేకరించే క్రమంలో వాటిని తారుమారు చేసిన వైద్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకుందని అజిత్ పవార్ వివరించారు.

తొలుత ఓటు... తర్వాతే తల్లి అంత్యక్రియలు

పాట్నా: ఓ వైపు లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. మరోవైపు కన్నతల్లి మరణించింది. దీంతో పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుంది ఆ కుటుంబం. అనంతరం తల్లి అంత్యక్రియల్లో పాల్గొంది. ఈ ఘటన శనివారం బీహార్‌లోని జెహనాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని దేవ్‌కులి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు మిథిలేష్ యాదవ్ స్పందించాడు.

తన తల్లి ఈ రోజు ఉదయం మరణించింది. ఆమె వయస్సు 80 సంవత్సరాలు. ఆమె తిరిగి రాదు. అంత్యక్రియలు కాసేపు ఆగి చేసుకోవచ్చు. ఎన్నికలు మళ్లీ రావు. అవి కూడా అయిదేళ్లకు ఓ సారి మాత్రమే జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఓటు వేసే అంశంపై కుటుంబ సభ్యులంతా కూర్చుని చర్చించాం. ముందు పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకొని అనంతరం తల్లి అంత్యక్రియలు జరపాలని నిర్ణయించామని యాదవ్ తెలిపారు. ఆ క్రమంలో కుటుంబ సభ్యులమంతా ఓటు వేసి. అనంతరం తన తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్నట్లు మిథిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు.

దిల్లీకి నీటి విడుదలపై రేపు సుప్రీం విచారణ

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో నీటి కటకటను పరిష్కరించేందుకుగాను హిమాచల్ ప్రదేశ్ నుంచి మిగులు జలాలను విడుదల చేయాలని హర్యానాకు ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య వెకేషన్ బెంచీ ఈ కేసును విచారిస్తుంది. హర్యానా నుంచి నీటిని దిల్లీకి విడుదల చేయాలని కోరుతూ మంత్రి అతిశీ ఫిర్యాదు చేశారు. బీజేపీ పాలిత హరానా, కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్ పేర్లను పిటిషన్‌లో చేర్చారు. నీరన్నది ప్రాథమిక హక్కు అని, మానవ మనుగడకు కీలకమని నొక్కిచెప్పారు. రాజ్యాంగంలోని 21వ అధికరణ కింద ఈ హక్కులకు హామీ ఇవ్వబడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వేసవిలో ఎండలు ఠారెత్తిస్తున్న క్రమంలో నీటి ఎద్దడితో రాజధాని వాసులు అల్లాడిపోతున్నారని, దిల్లీ ఎన్సీటీ ప్రజలకు గౌరవప్రద జీవిక హక్కును కాదనలేమని, వారికి పరిశుభ్రమైన తాగు నీరు సముచితంగా కల్పించాలని పిటిషన్ పేర్కొంది.

మణిపూర్ జలదిగ్బంధం

ఇంఫాల్: మణిపూర్‌లో రెమాల్ తుపాను బీభత్సం సృష్టించింది. భారీ వర్షాలు, వరదల కారణంగా ఐదుగురు మరణించారు. మరో 13 మంది గాయపడ్డారు. లక్షలాది మందిపై వరద ప్రభావం పడింది. ఇంఫాల్ నగరం నుంచి ప్రవహించే చాలా నదుల్లో నీటి మట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలకు రెండు రోజుల సెలవు ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. స్థానిక మీడియా కథనం మేరకు వరద బీభత్సానికి ఐదుగురు మరణించారు. సహాయ, విపత్తు నిర్వహణ శాఖ విడుదల చేసిన తాజా సమాచారం ప్రకారం రాష్ట్రంలో 255 గ్రామాలు, ప్రాంతాల్లో మొత్తం 1,26,950 మంది జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. 16,364 ఇళ్లు దెబ్బతిన్నాయి. వరదల్లో చిక్కుకున్న 20,504 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 522 హెక్టార్ల పంటకు నష్టం వాటిల్లింది. కొండ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో మూడు రోజుల్లో 292 కొండచరియలు విరిగిపడ్డాయి. బాధితుల కోసం 51 సహాయక శిబిరాలు ప్రారంభించినట్లు అధికారిక నివేదిక తెలిపింది. ఇంఫాల్ మీదుగా ప్రవహించే చాలా నదులలో నీటి మట్టాలు వేగంగా పెరిగాయి. రెండు ప్రధాన నదులు ఇప్పటికే ఇంఫాల్ తూర్పు, పశ్చిమ జిల్లాల్లోని అనేక ప్రాంతాలకు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఇంఫాల్ పశ్చిమ, తూర్పు జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో వైమానిక దళం, నౌకాదళం, సైన్యాన్ని మోహరించారు. ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమ, విష్ణుపూర్, జిరిబామ్, నోనీ, కాంగ్పోక్పి, తమెంగ్లాంగ్, చందేల్, చురాచంద్‌పూర్, సేనాపతి, కక్చింగ్ సహా అనేక వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక సామగ్రి పంపిణీ చేశారు. ఇప్పటివరకు 969 మంది పురుషులు, 992 మంది మహిళలు, 601 మంది పిల్లలు సహా మొత్తం 2,561 మందిని రక్షించినట్లు సహాయక చర్యల్లో పాల్గొన్న అసోం రైఫిల్స్ తెలిపింది. ఇంఫాల్ పట్టణం, చుట్టుపక్కల వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి మట్టాలు నెమ్మదిగా తగ్గుముఖం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రధాన మార్కెట్ ప్రాంతాలు (ఎంజీ అవెన్యూ, తంగల్ బజార్, పానా) ఇంకా నీటిలోనే ఉండగా, విష్ణుపూర్ జిల్లాలోని నాంబోల్ వరద ప్రభావిత జాబితాలో చేరింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినీత్ జోషితో కలిసి ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ ఇంఫాల్‌లోని వరద ప్రభావిత పానా బజార్‌ను సందర్శించారు.

4న భారత్‌లో కొత్త పొద్దు పొడవనుంది: స్టాలిన్

చెన్నై: ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని, 4వ తేదీన కొత్త పొద్దు పొడవబోతోందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఉద్ఘాటించారు. ఇండియా కూటమి విజయానికి చేరువగా ఉన్నదని చెప్పారు. ప్రతిపక్ష కూటమి దేశ ప్రజల్లో ఆశలు చిగురింపజేసిందని అన్నారు. విపక్ష పార్టీల నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి మరింతగా వెళ్లగలిగారని, బీజేపీ సృష్టిత తప్పుడు రూపాన్ని రూపు మాపగలిగారని స్టాలిన్ అన్నారు. శనివారం ఇండియా కూటమి భేటీ అయి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తుందని సమావేశానికి ముందు 'ఎక్స్'లో తమిళనాడు సీఎం పేర్కొన్నారు. తమ పార్టీ ప్రతినిధిగా టీఆర్ బాలు హాజరైనట్లు చెప్పారు. బీజేపీ పదేళ్ల ఫాసిస్టు పాలన అంతమే లక్ష్యంగా ప్రతిపక్ష కూటమి ఏర్పాటైందని, అనుకున్న లక్ష్యం నెరవేరబోతోందని స్టాలిన్ విశ్వాసం వ్యక్తంచేశారు. లక్ష్యసాధనకు ఇండియా కూటమి ఎంతో దూరం లేదన్నారు. తన పోటీయే లేదనుకున్న బీజేపీకి విపక్ష కూటమి బుద్ధి చెప్పిందన్నారు. ఫలితాలు వెలువడేందుకు మూడు రోజులే ఉన్నాయని, ఓట్ల లెక్కింపు సమయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని స్టాలిన్ సూచించారు. లోక్‌సభ ఎన్నికల తుది దశ పోలింగ్ ముగిసింది. జూన్ 4న ఫలితాలు వెలువడతాయి. ఎగ్జిట్ పోల్స్ మొదలయ్యాయి. దీంతో గెలుపు తమదే అంటూ ఇండియా కూటమి, ఎన్డీయే కూటమి చెబుతున్నాయి.

బెంగాల్‌లో 95 వేల ప్రచార ర్యాలీలు

దేశంలో ఇదే అత్యధికం

హెలికాప్టర్ల వినియోగానికి 890 అర్జీలు

669కి అనుమతి: ఈసీఐ

న్యూదిల్లీ: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత రెండున్నర నెలల పాటు సాగిన ప్రచారంలో భాగంగా దేశంలోనే అత్యధిక ర్యాలీలు పశ్చిమ బెంగాల్‌లో జరిగాయి. మొత్తం 94,975 ప్రచార ర్యాలీలకు అనుమతిచ్చినట్లు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) డేటా తెలిపింది. 1,19,276 దరఖాస్తులు రాగా అందులో 94,975కు అనుమతిచ్చింది. పశ్చిమ బెంగాల్ నుంచి 42 మంది, మహారాష్ట్ర నుంచి 80, మహారాష్ట్రలో 48 మంది ఎంపీలు ఎన్నికవుతారు. సువిధా పోర్టల్ డేటా ప్రకారం చివరి దశలో ఎన్నికలు జరిగిన ఉత్తర 24 పరాగణాల్లోని బసిర్హత్, బరాసత్ లోక్‌సభ స్థానాలలో 10,245 ప్రచార ర్యాలీలకు ఈసీఐ అనుమతులు ఇచ్చింది. అలాగే, ఎన్నికల ప్రచారానికి హెలికాప్టర్ల వినియోగానికి 890 దరఖాస్తులు రాగా 669కి ఈసీఐ అనుమతిచ్చింది. అత్యధికంగా 521 అనుమతులు పొందిన పార్టీగా తృణమూల్ కాంగ్రెస్ నిలిచింది. 124 అనుమతులతో బీజేపీ ఆ తర్వాత స్థానంలో ఉంది. ఎన్నికల ప్రచారం క్రమంలో మొత్తం రూ.440 కోట్ల విలువ చేసే నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, విలువైన వస్తువులను ఈసీఐ స్వాధీనం చేసుకుంది. రూ.110 కోట్ల విలువ చేసే మద్యాన్ని సీజ్ చేసింది. 852 కిలోల పేలుడు పదార్థాలు, 1,605 నాటు బాంబులు, 707 తుపాకులనూ స్వాధీనం చేసుకుంది. సీ-విజిల్ ద్వారా 40,806 ఫిర్యాదు రాగా 36,295 ఫిర్యాదులపై చర్యలు తీసుకుంది. 4,443 ఫిర్యాదులను కొట్టివేసింది. మరో 68 పెండింగ్‌లో ఉన్నాయి.

ఇది మారణహోమం

గాజాలో కాల్పుల విరమణకు ఏచూరి డిమాండ్

పలస్తీనాకు మద్దతుగా దిల్లీలో వామపక్షాల నిరసన

న్యూదిల్లీ: గాజాలో ఇజ్రాయిల్ యుద్ధం చేయడం లేదు... మారణహోమం సృష్టిస్తోందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. గాజాలో తక్షణ కాల్పుల విరమణకు వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఇజ్రాయిల్‌కు మోదీ ప్రభుత్వం మద్దతిస్తుండటాన్ని దుయ్యబట్టాయి. పలస్తీనాకు మద్దతుగా దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం నిర్వహించిన నిరసనలో సీపీఎం, సీపీఐ(ఎంఎల్-న్యూ డెమొక్రసీ), సీఐటీయూసీ, ప్రగతిశీల మహిళా సంఘటన్, జనవాదీ మహిళా సమితి, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐడీఎస్ఓ, కేవైఎస్, ఏఐఎస్ఏ, దాహో, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.'కాల్పుల విరమణ, ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరా ఆపాలి, హింసను వీడాలి' అనే ప్లకార్డులు ప్రదర్శించారు. పలస్తీనాకు మద్దతుగా నినాదాలిచ్చారు. ఏచూరి మాట్లాడుతూ 'ఇక్కడ జరుగుతున్నది యుద్ధం కాదు మారణహోమం. రెండు సాయుధ దళాల మధ్య జరిగేదాన్ని యుద్ధమంటారు. ఇక్కడ నిరాయుధులపై దాడులు చేస్తున్నారు. ఇది ఆక్షేపణీయం' అని అన్నారు. తాము విద్యార్థులుగా ఉన్నప్పుడు తమ పాస్‌పోర్టులపై ఇజ్రాయిల్, దక్షిణాఫ్రికాకు అది చెల్లదని రాసివుండేదని గుర్తుచేశారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుకు మద్దతిచ్చేందుకు మోదీ ప్రభుత్వం మోకరిల్లిందని దుయ్యబట్టారు. ఈ కిరాతకాన్ని ఆపేలా ఇజ్రాయిల్‌పై యావత్ ప్రపంచం ఒత్తిడి తేవాలన్నారు. యుద్ధ నేరాల కోసం ఐసీజేలో నెతన్యాహును విచారించాలని అన్నారు. పలస్తీనాకు కట్టుబడిన భారత విదేశాంగ విధానం నుంచి మోదీ ప్రభుత్వం పక్కకు తప్పుకుంటోందని ఏచూరీ అన్నారు. కార్యక్రమంలో దిల్లీ డిప్యూటీ మేయర్, ఆప్ నేత మహమ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

మోదీ మౌనం నేరస్థులకు బలం

పదేళ్లలో బాధితులకు జరగని న్యాయం: అల్కా లాంబా

న్యూదిల్లీ: మహిళలకు న్యాయం చేయడంలో పదేళ్ల మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అఖిలభారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా విమర్శించారు. అనేక మంది మహిళలపై అత్యాచారానికి ఒడిగట్టిన కర్నాటక ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను దేశం నుంచి పారిపోయేందుకు సహకరించిందని దుయ్యబట్టారు. ఈ వ్యవహారంలో ప్రధాని మౌం వీడాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలన్నారు. కామాంధుడు తప్పించుకునేందుకు అవకాశం కల్పించడమేనా 'మోదీ కి గ్యారంటీ' అని అల్కా లాంబా నిలదీశారు. ప్రజ్వల్‌ను దేశానికి రప్పించి అరెస్టు చేయించిన కర్నాటక ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. 'బేటీ బచావో అంటూ నరేంద్రమోదీ నినాదాలు ఇస్తూ వచ్చారు కానీ ప్రజ్వల్ రేవణ్ణ వ్యవహారంలో మౌనం వీడలేదు' అని ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అల్కాలాంబా వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ సాయాన్ని కోరుతూ కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య లేఖ రాస్తే స్పందన రాలేదని గుర్తుచేశారు. ప్రజ్వల్ రేవణ్ణను దేశానికి రప్పించాలని కోరుతూ ప్రధానికి సీఎం మరొక లేఖను 21 రోజుల తర్వాత పంపారని, దీనిని బట్టి ఈ కేసులో మోదీ చిత్తశుద్ధి ఎంతో అర్థమవుతోందన్నారు. నేటికీ బాధితులు, సాక్షులను ఒత్తిడికి గురిచేస్తున్నారని, ప్రధాని మోదీ మౌనం వీడాలని, సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశ ముండదని హామీ ఇవ్వాలని, దేశ ఆడబిడ్డలకు న్యాయం చేస్తామని భరోసా ఇవ్వాలని అల్కా డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లో అత్యాచారానికి గురైన దళిత యువతి గురించి ప్రస్తావిస్తూ నిందితులు బీజేపీ నేతలని, తొలుత బాధితురాలి సోదరుడు, ఆపై మామయ్య హత్యకు గురయ్యారని తెలిపారు. మమయ్య భౌతికకాయాన్ని తరలించే క్రమంలో బాధితురాలు కూడా మృత్యుఒడికి చేరుకున్నారని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. రాజస్థాన్‌లో 1,644 మంది బాలికలతో పాటు మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు జరిగిన 12,000 కేసులు గత ఐదు నెలల్లో వెలుగు చూశాయని బీజేపీపై అల్కా లాంబా ఆగ్రహం వ్యక్తంచేశారు. మధ్యప్రదేశ్‌లోని సిద్దీలో 25మందికిపైగా గిరిజన మహిళలు, విద్యార్థులు అత్యాచారానికి గురయ్యారని తెలిపారు.

నగదు అక్రమ బదిలీ కేసులో

ప్రభుత్వం ఎవరినీ రక్షించదు

కర్నాటక సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు: కర్నాటక మహర్షి వాల్మీకి గిరిజన తెగల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌కు సంబంధించిన అక్రమ నగదు బదిలీ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఎవరినీ రక్షించదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం ప్రకటించారు. అక్రమ నగదు బదిలీ కేసులో సీబీఐ విచారణను కోరుతూ, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ శాఖ మంత్రి బి.నాగేంద్రను బర్తరఫ్ చేయాలని ప్రతిపక్ష బీజేపీ డిమాండ్ చేసిన కొన్ని గంటల తర్వాత ఈ ప్రకటన వచ్చింది. మంత్రి నాగేంద్రను తొలగించాలని బీజేపీ డిమాండ్ చేయడంపై అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య విలేకరులతో మాట్లాడుతూ 'మేము ఎవరినీ రక్షించము. ఎవరైనా సరే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాము' అని తెలిపారు. కార్పొరేషన్‌లో అకౌంట్స్ సూపరింటెండెంట్ పి.చంద్రశేఖర్ మే 26న ఆత్మహత్యాయత్నానికి పాల్పడి డెత్ నోట్‌ను వదిలివేయడంతో అక్రమ నగదు బదిలీ వెలుగులోకి వచ్చింది. కార్పొరేషన్‌కు చెందిన రూ.187 కోట్లను దాని బ్యాంక్ ఖాతా నుంచి అనధికారికంగా బదిలీ చేసినట్లు వెల్లడించింది. దాని నుంచి రూ.88.62 కోట్లు 'ప్రసిద్ధ' ఐటీ కంపెనీలకు, హైదరాబాద్‌కు చెందిన ఒక సహకార బ్యాంకుకు తరలించినట్లు పేర్కొంది. చంద్రశేఖర్ ఇప్పుడు సస్పెండ్ చేయబడిన కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జె.జి.పద్మనాభ్, అకౌంట్స్ ఆఫీసర్ పరశురామ్ జి దురుగన్నవర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సుచిస్మిత రావల్‌ను నోట్‌లో పేర్కొన్నారు. అదే సమయంలో నిధులను బదిలీ చేయడానికి 'మంత్రి' మౌఖిక ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు కోసం బెంగళూరులోని క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఆర్థిక నేరాల అదనపు పోలీస్ డైరెక్టర్ జనరల్ మనీష్ ఖర్బీకర్ నేతృత్వంలో నలుగురు సభ్యుల సిట్ బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఎవరినీ రక్షించదని, ఎవరినీ విడిచిపెట్టబోదని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'బీజేపీ రాజకీయాలు చేస్తోంది, నేను వారిని ప్రశ్నించను.. బీజేపీ హయాంలో కూడా ఇలాంటివి జరిగాయని బసవరాజ్ బొమ్మైకి తెలుసు. అందరికి కూడా తెలుసు. కేసు దర్యాప్తు చేస్తున్నాం. ఎవరినీ విడిచిపెట్టము' అని తెలిపారు. ఈ కేసులో మంత్రి నాగేంద్రకు ప్రత్యక్ష ప్రస్తావన లేదని శివకుమార్ అన్నారు. 'ఏదైనా పత్రాలు లేదా రుజువులు లేదా ఏదైనా ప్రమేయం దొరికితే, ఏది చేయవలసి ఉన్నా, ప్రభుత్వం తప్పకుండా చేస్తుంది. ప్రభుత్వం పారదర్శకంగా ఉంది. ఎవరినీ విడిచిపెట్టే ప్రశ్నే లేదు. మేము చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం డబ్బు మాకు ముఖ్యం. మా అధికారులు దానిని కనుగొనడానికి ప్రయత్నిస్తున్నారు' అని వివరించారు. ఇంకా రెండు రోజులు సమయం కావాలని డిప్యూటీ సీఎం చెప్పారు. ఆ తర్వాత ప్రభుత్వం తప్పకుండా చర్యలు తీసుకుంటుందని, కొన్ని అరెస్టులు చేశామని, ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, మంత్రి నాతో, సీఎంతో మాట్లాడారని, దీనిపై విచారిస్తున్నామని ఆయన తెలిపారు. సీబీఐ దర్యాప్తు డిమాండ్‌పై మాట్లాడుతూ బ్యాంకు మోసం కేసులో కొన్ని కోట్ల కంటే ఎక్కువ డబ్బు ప్రమేయం ఉంటే, సహజంగానే కేసు సీబీఐకి వెళ తుందన్నారు. ఇదిలాఉండగా, కార్పొరేషన్‌లో అవకతవకలకు గురైన డబ్బు 'లబ్ధిదారుల్లో' ఐటీ సంస్థ హ్యాపీయెస్ట్ మైండ్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ పేరుతో ఉన్న బ్యాంక్ ఖాతా కూడా ఉందని మీడియా నివేదికల మధ్య, ఆ బ్యాంకు ఖాతా తమకు చెందదని కంపెనీ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

విశాలాంధ్ర స్కూల్ ఆఫ్ ప్రింటింగ్

ప్రముఖ ప్రింటింగ్ టెక్నాలజిస్టు శ్రీ గంపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రింద పేర్కొన్న విధంగా వివిధ విభాగాలలో శిక్షణ ఇవ్వబడుతుంది.

ప్రెస్ : ఆఫ్‌సెట్ మెషిన్ మన్ (వెబ్ & షీట్ ఫీడింగ్)
ప్రీ-ప్రెస్ : కంప్యూటర్ టు ప్లేట్ (సిటిపి)
పోస్ట్ ప్రెస్ : బైండింగ్ డిపార్టుమెంట్
శిక్షణా కాలం : ఒక సంవత్సరం (ప్రాక్టికల్స్ & థియరీ)
విద్యార్హతలు : ఎస్ఎస్‌సి పాస్ లేక ఫెయిల్
వయస్సు : 20-25 సంవత్సరములలోపు
స్టైఫండ్ : నెలకు రూ.10,000/-

ఎంపిక పూర్తిగా అభ్యర్థి ఆసక్తి మరియు కృషిపై ఆధారపడి ఉంటుంది

ఆసక్తి గలవారు ఈ క్రింది చిరునామాకు దరఖాస్తు చేసుకొనగలరు

జనరల్ మేనేజర్, విశాలాంధ్ర దినపత్రిక
చుట్టుగుంట, విజయవాడ - 520 004
ఫోన్ : 94405 73343

శ్రద్ధాంజలి

శ్రీ పెండ్యాల వెంకట కృష్ణారావు గారు (కృష్ణబాబు)
మాజీ శాసనసభ్యులు, కొవ్వూరు
31.05.1953 21.05.2024

మంచి మనస్సు, ఉన్నతమైన వ్యక్తిత్వం, నిస్వార్థ ప్రజాసేవలతో కల్మషమెరుగని మీరు జనహృదయాలలో చిరస్మరణీయునిగా నిలిచారు. మీ జీవితం మాకు ఆదర్శప్రాయం. మీ మరణం మాకు తీరనిలోటు. మీ ఆత్మ శాంతికి భగవంతుని ప్రార్థిస్తూ...

యాజమాన్యం, సిబ్బంది మరియు కార్మికులు

ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్

తణుకు | కొవ్వూరు | సగ్గొండ | తాడువాయి | గుంటూరు | భీమడోలు

ది ఆంధ్రా పెట్రో కెమికల్స్ లిమిటెడ్, విశాఖపట్నం | జోసిల్ లిమిటెడ్, డోకిపర్రు | జయలక్ష్మి ఫర్టిలైజర్స్, వెంకటరాయపురం, తణుకు

శ్రీ అక్కమాంబ టెక్స్‌టైల్స్ లిమిటెడ్, వెంకటరాయపురం, తణుకు | శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ లిమిటెడ్, వెంకటరాయపురం, తణుకు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.